**శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!**



శ్రీసాయిబాబా ఇలా అన్నారు...
"నేను శరీరాన్ని వదిలినా, నా మాటలు ప్రమాణంగా తీసుకోండి.
నా ఎముకలు నా సమాధి నుండి మీకు ధైర్యాన్నిస్తాయి.
నేను కాదు, నా సమాధి కూడా మీతో మాట్లాడుతుంది.
దానికి అనన్యంగా శరణు చెందే వారితో అది ఉంటుంది.
నేను మీ కంటికి కనిపించను. మీరు చింతపడవద్దు".

# గురుకృప

అనంతప్రేమకు అక్షర ఆరాధన



# ప్రేమే సాధనం

"ఆనంద జీవన సాయిపథం"... ఏడ్చుకుంటూ ఉండటం కాదు. ఇరవై నాలుగు గంటలూ ఇప్పటి వరకు అన్నీ ఇచ్చారు కానీ, ఈ ఒక్కటి మాత్రం ఎందుకు ఇవ్వలేదు? హూ... బాబాకు నా మీద ప్రేమలేదు. హూ... నాకది లేదు, హూ... నాకిది లేదు అనుకోవడం. వాళ్ళను మాత్రం నేను ఏ పరిస్థితుల్లోనూ దగ్గరకు పిలిచి సముదాయించను. ఈ అలిగిన వాళ్ళను, ఈ కోపాలు పెట్టుకునేవాళ్ళను. బాబా మీద అలిగితే ఎవరికట? అలుగు! నీ కోపం ఎవరిమీద? మనవాళ్ళు ఒక సామెత చెబుతారు చూసారా "స్త్రీ బాలానం రోదనం బలం" అనంటారు. మనవాళ్ళు దాన్ని ఎట్లా అర్థం చేసుకుంటారంటే ఎంత ఏడిస్తే అంత బలం అనుకుంటారు. అది కాదు ఉద్దేశ్యం. దాని ఉద్దేశ్యం అది కాదు వాళ్ళకి. అంటే ఆ రోజుల్లో ఇప్పుడు కాదులే, ఇప్పుడు మగవాళ్ళకు చెప్పుకోవాలది. ఆ రోజుల్లో స్త్రీలుగాని, పిల్లలుగాని, ఏదన్నా సాధించుకోవాలంటే, ప్రతిదానికి ఏడుస్తారు. ఇప్పుడు పిల్లలు అట్లాగే ఉన్నారు. ఆ...ఆ... నాకు అది కావాలంటారు. నాకు ఇది కావాలంటారు... వాడు ఏడిస్తే ఏమైపోతుందో అని కొంపలు మునిగి పోయినట్లుగా వాటిని కొనిస్తారు. వాడు చెప్పింది చేస్తారు. ఇంట్లో ఆడవాళ్ళు అంతే. నాకు పట్టుచీర కొనివ్వలేదే, నన్ను సినిమాకు తీసుకుపోలేదే, అది చెయ్యలేదే అని ఏడవడం, ఆ ఏడుపు తట్టుకోలేక వీళ్ళు కొనిస్తుంటారు. అది ఆ రోజుల్లో సంగతి. ఆ సామెతకు అర్థం అది. వాళ్ళకు బలం ఏమిటనంటే వాళ్ళ ఏడుపేనట. దాంతో అన్నీ సాధించుకుంటారట వాళ్ళు. కొంతమంది పిల్లలున్నారు. నిజంగా ఇచ్చేవాళ్ళున్నా సరే ఊరికే ఏడుస్తూ అడుగుతారు. ఆ...ఆ... నాకు అది కావాలంటారు. ఎందుకు అట్లా అడగడం? ఏడవడం ఎందుకు? అట్లా మనం అలవాటు చేసాం. వాడు ఏడిస్తేగాని ఇవ్వకుండా మనం చేసాము కనుక పిల్లవాడు

సంపుటి : 22
సంచిక : 5



నవంబర్ 13
2019

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

4 పథగామి – గురుకృప
8 అన్వేషణ...ఆత్మపరిశీలన.. ఆరాధన – 'భీమ్'
11 ప్రేమవాహిని – శరశ్చంద్రికలు
18 సద్గురు సన్నిధిలో సాధన - సాటిలేని ఆనందార్చన – సుంకర నర్మద
23 ఆశీస్సుల అంతరార్థాలు – గురుకృప
25 గురుకృపాలహరి – గురుకృప



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో తాత్త్వికులు, తార్కికులన్న బేధం లేకుండా ఎందరో మహితాత్ములు, సంతప్రముఖులు, సత్పురుషులు ఒకే మాటగా చెప్పిన, వేనోళ్ళ కీర్తించిన అవతార పురుషులు సద్గురు సామ్రాట్టు శ్రీసాయిబాబా. ఎందుకు శ్రీసాయిని సామ్రాట్టుగా వర్ణించారు? అవధూత తత్త్వాల నుండి అంతర్యామిగా భాసించడం వరకు వారి జీవితంలోని ఏ కోణం చూసినా–మానవులకే కాదు, మహాత్ములకు కూడా వారిలోని పరమాణువును కూడా అర్థంచేసుకో సాధ్యపడలేదు. ఇదిగో మనం చెప్పుకోబోయే మాటలు కూడా అంతే! సాయి అన్న విశాల విశ్వంలో పరమాణువును మాత్రమే వర్ణిస్తున్నట్లుగా భావించమని మనవి. సర్వజీవ స్వరూపుడు శ్రీసాయి అని చెప్పుకుంటే ఆ దర్శనమయిన వ్యక్తికి మాత్రమే పరిమితం కదా ఆ అనుభవం. కానీ తాను భిక్ష చేసుకువచ్చి ఆ భిక్షపాత్రలోనే అన్ని జీవులతో పాటు తానూ ఆహారాన్ని స్వీకరించగలిగితే, వాటితో ఆహారాన్ని పంచుకోగలిగితే, అనుకున్న మాటకు – ఆచరించిన బాటకు సమన్వయపడిందా? లేదా? శ్రీసాయి అంటే ఆచరణాత్మక ప్రబోధం – మాటలలో బోధించని వేదం – మానవమస్తిష్కానికి అందని చర్యల అగాధం. 'అనరగ్ని రనికేతస్యా గ్రామ మన్నార్థమాశ్రయేత్' తనకోసం వంట, తనకంటూ ఇల్లు లేక, దేహము పట్ల, విషయాల పట్ల ఉపేక్ష కలవాడై ఆహారము కొరకు మాత్రమే గ్రామంలోకి అడుగుపెడుతూ.. అనికేతునిగానే తన జీవనం సాగించి, ఆచరించి చూపిన ధర్మస్వరూపులు శ్రీసాయి. అందుకే గురుదేవులు ఇలా అన్నారు – **"నిజానికి, ఆత్మజ్ఞానానంద పరవశులైన మహాత్ముల అనుభూతుల స్మృతులే మానవాళికందిన మహితశ్రుతులు, వారి చర్యలే మానవ ధర్మశాస్త్రాలకు ఆధారస్మృతులు. తరచిచూస్తే, సకల శ్రుతి స్మృతి పురాణేతిహాసాల సారం – శ్రీసాయి వంటి మహాత్ముల సచ్చరితల సారమే కదా!"**. గమనిస్తే వారి 'మాటలే' స్మృతులు అనలేదు శరశ్చంద్రులు. వారి 'చర్యలు' అన్నారు. సద్గురుపథం పారదర్శక పథం.. ఆచరణే ఆయువుగా శోభించిన అడుగుజాడల పథం. పూజ్య గురుదేవుల జీవిత విధానం పరిశీలిస్తే వారిది ఆచరణల రాచబాట. వారిలోని సాధకుడు చల్లనీళ్ళు స్నానానికి ఇబ్బంది పెడితే ఆ నీళ్ళను కొన్ని గంటలపాటు కుండలో ఉంచి శరీరానికి సౌఖ్యమనే అలవాటును దూరం చేసాడు. గురువు చెప్పిన మాటకు కట్టుబడడానికి, సత్సంగాన్ని చేరడానికి ప్రాణాలకు సైతం లెక్క చేయని వ్యక్తిత్వం వారి సొంతం... శ్రీసాయి చూపిన ఆశయసిద్ధికి కీర్తి స్తంభంగా నిలిచే క్రమంలో ఎన్నడూ ధనానికి, ఆశ్రమాలకు,



వ్యవస్థలకు చోటివ్వని ఆచరణతత్త్వం వారిది. ఓ వంక వేళ్ళూనుకుపోయిన ఛాందస భావాలను తుడిచివేస్తూనే–మరుగున పడిపోయిన మూలాలను గుర్తు చేసే జీవన విధానం వారిది. నీటిని, పాలను విడివిడిగా చూసి, చూపించి, పాటించే ఆచరణలు – మాకు దర్శనమిచ్చిన ఆ'చరణాలు'. ఇలా ఏ తావు చూసినా ఒక్కటే బాట 'ఆచరణ'.

**మహాత్ముల బాటలు–భక్తుల ఆచరణల పూదోటలు :**

"స్వల్పమప్యస్య ధర్మస్యత్రాయతే మహతోభయాత్" ఈ ధర్మం కొంచెమైనా ఆచరించితే అది మనలను మహాఆపదల నుండి కాపాడగలదు అంటుంది భగవద్గీత. అత్యున్నత భావాలను వ్యక్తం చేస్తూ, అధమాధమ నడతను కలిగి ఉండటాన్ని ఆధ్యాత్మికత ఎన్నడూ శ్లాఘించలేదు. ఆచరణలో పెట్టని భావాలు నిష్ప్రయోజమే! అందుకే శ్రీసాయి సమర్థుల నుండి గురుదేవుల వరకు మాట కంటే, ఆచరణకే ప్రాధాన్యతనిచ్చారు. మనందరం పరమహంసగా భక్తి ప్రపత్తులను చెల్లించే శ్రీరామకృష్ణులు వినయప్రాప్తికై ఏం చేశారో తెలుసుకుంటే ఆచరణకు అర్థం తెలుస్తుంది. రాణి రాస్మణి ఆదేశం మేరకు రుచికరమైన మృష్టాన్నాలు వండి వార్చేవారు. అతిధులని, యాత్రికులని, సాధువులని లెక్కలేనంతమంది వచ్చి ఆహారాన్ని స్వీకరించేవారు. వారందరూ భుజించాక ఆ ఎంగిలి విస్తళ్లను ఎత్తి, తలపై మోసి గంగ ఒడ్డున పడేసేవారు రామకృష్ణులు. సూర్యోదయం కాకపూర్వమే సువిశాలమైన ఆలయ ప్రాంగణాన్ని చీపురుతో శుభ్రం చేసేవారు. నిద్రలేచి చూసిన ఆలయ పనివాళ్ళకు దైవమో, దైత్యమో ఏది శుభ్రం చేసిందో అర్థం కాకపోయేది. అమ్మ దర్శనం కోసం అంతగా విలపించే రామకృష్ణుల వంటివారే, ఆ తల్లి జగన్మాతతో సంభాషించే ఆ ప్రేమమూర్తే–ఆచరించి చూపుతుంటే మనమెంతటివారం. ఒకసారి ధూమల్ శిరిడీ వెళ్ళినపుడు బాబా పలుమార్లు దక్షిణ అడిగి తనదగ్గరున్న డబ్బునంతా తీసేసుకున్నారు. ఒక్కపైసా కూడా తన వద్దలేని ఆ సమయంలో "భావ్! ఏడు రూపాయలిమ్ము!" అని అడిగారు బాబా. తన దగ్గర డబ్బులేదని చెప్పిన ధూమల్‌కు "వెళ్ళి ఎక్కడనైన తీసుకుని రమ్ము" అని ఆజ్ఞాపించారు సాయి. ధూమల్‌కు పాఠం బాగా అర్థమైంది. "నేను గొప్పవాడను, ఒకరి వద్దకు వెళ్ళి యాచించుటకు, అప్పుగానైన అడుగుటకు నాకేమి గతి పట్టినది! అన్న దురభిమానమును, గర్వమును తొలగించుటకే బాబా ఆ విధముగ అడిగెను. ఇది అణకువను బోధించు చక్కని పాఠము" అని అర్థం చేసుకున్నాడు. శ్రీసాయినాథుల సమాధి అనంతరం ధూమల్ శిరిడీకి వెళ్ళి బాబా భిక్షచేసిన గృహములందు భిక్ష తెచ్చుకుని భుజించేవాడు. నాడు సాయి చెంతన



పొందిన శిక్షణ ఆచరణగా రూపుదాల్చింది. మనిషిగా జీవించేందుకు అవకాశమిచ్చింది. సాయిభక్తుడైన ధూమల్ ఆచరణ మనకు చక్కటి దారి చూపుతోంది కదా!

**ఆచరిస్తున్నామా? ఎలా చరిస్తున్నాం :** మనందరకు చాలా విషయాలు తెలుసు. కానీ విషయాలు తెలియడం ముఖ్యం కాదు. ఆచరించడం ముఖ్యం. అవి అనుభవానికి రావడం ముఖ్యం. ఒక చిన్న విషయం. మనకు సద్గ్రంథం చదవాలనిపించడమే  సద్గురు అనుగ్రహం. ఎందుకంటే మనం బాగవడానికి సమయం ఆసన్నమైనట్లే. సద్గ్రంథం అంటే జీవించడం చేతనైన వారి కథలు. జీవించడాన్ని నేర్చుకుంటున్న వారికథలు. జీవించడమెలాగో గ్రహించుకుంటున్న వారి కథలు. టి.వి. సీరియల్స్, నుండి నేటి వెబ్ సిరీస్ వరకు 'క్రమ'బద్ధంగా చూడాలన్న కుతుహలం స్వాధ్యాయం చేసే క్రమంలో చూపలేకపోతున్నాం. అధ్యయనం చేసిన దానిని ఆచరించే క్రమంలోనూ చూపలేక అక్టోబర్‌లో గాంధీ, పటేల్‌ను జనవరిలో వివేకానందులను తలచుకుంటూ ఆ రోజుల్లో తప్ప మిగిలిన రోజుల్లో అసత్యమాడుతూ, కుల, మత, ప్రాంతాలుగా విడిపోతూ, పరిస్థితులను ఎదుర్కొక పలాయన వాదంలో పరిభ్రమిస్తూ, భ్రమిస్తూ బ్రతుకుతున్నాం. అలా అలవాటయిపోయింది మనకు. సంస్మరణలే కానీ, సంస్కరణకు మాత్రం నోచుకోవడం లేదు. మనం చేసే పనుల పరిణామాన్ని గుర్తించడం లేదు. **శ్రీబాబూజీ మాటల్లో చూస్తే "ధ్యానంలోని నీ స్థితి. నీవు ధ్యానానికి వెలుపల గడిపే సమయం ఎలా గడుపుతున్నావు అనే దాని మీద ఆధారపడి ఉంది. ఎవరూ దాన్ని పట్టించుకోరు. ధ్యానం చేయని సమయాన్ని సరిచేసుకోగలిగితే ధ్యానం సునాయాసంగా కుదురుతుంది".** ఇలా మన ఇబ్బందంతా అనుభూతికి నోచుకోని మన జీవనవిధానంతోనే. ఈ అనుభూతికి దోహదం చేసే ఆచరణను అందిపుచ్చుకునే క్రమంలో సద్గురు చరణాలకు ప్రణామం చేద్దాం. **"ఈ జీవితమనే గ్రంధాన్ని రసవత్తరంగా చదువుకోవడానికి బాబా చెప్పక విడిచిన విషయం లేదు" అంటారు శ్రీబాబూజీ.** బాబా చెప్పిన విషయాలన్నీ మనకు తెలుసు - బాబా ఆచరించి చూపిన బాటల వెలుగు దీపాలలో మనలోని చీకట్లను తొలగించుకున్నాం - అయితే ఆ దీపం చక్కగా వెలుగుతుండాలంటే ఆచరణల చమురు మాత్రమే ఆ దీపాన్ని దేదీప్యమానంగా వెలిగించగలదని మరిచిపోతున్నాం.

**గురుచరణాలను తలదాల్చు - గురు 'ఆచరణ'లకు తలవాల్చు:** "మనిషి జీవితం (కష్టాలతో బాధపడటానికి) నలగడానికి కాదు - వెలగడానికి" అన్నది సద్గురు చంద్రులు నడిచి చూపిన



ఆనందపథం - అదే వారి ఆచరణాత్మక ప్రబోధం. వెలిగిపొమ్మని ఆదేశించడం కాదు. ఆ వెలుగుకు వలసిన వాతావరణాన్ని కూడా వారే ఏర్పాటు చేసారు. పారాయణతో **"ఒకానొక మహత్తర అంశాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి, అపారమైన దాని తత్త్వాన్ని ఆకళింపు చేసుకొనే సాధనా"**న్ని ప్రసాదించి సాయి అనే తత్త్వాన్ని ఆకళింపు చేసుకుని అహంకారరహితంగా, ఎవ్వరినీ నిందించకుండా, ఎవ్వరితో పోటీపడకుండా, సోమరిగా ఉండకుండా, పరనింద చేయకుండా, మొదలుపెట్టిన దానిని చివరి కంటా పూర్తి చేసుకుంటూ, మతం మళ్ళు మన మానవత్వానికి మచ్చ తేకుండా, ఎదుటివారి బలహీనతలను గూర్చి మాట్లాడకుండా, వ్యామోహానికి గురికాకుండా, ఉన్న దానితో తృప్తి పడుతూ, ఆనందంగా జీవించేందుకు ఆ సద్గురుమాయి బిడ్డగా పుట్టడమే అర్హతగా అర్థం చేసుకొని, జీవించేందుకు 'పారాయణ'ను ఉపయోగ పెట్టుకొమ్మని ఆనందపు 'గని'ని - ఆచరణల 'పని'గా అందించాలి. ఇలా శ్రీసాయి చెప్పిన 'పని' చేయించారు శ్రీబాబూజీ. సత్సంగాన్ని ప్రసాదించి అందరూ కలిసి, సాయి చూపిన బాటలో నడుస్తూ, లోటుపాట్లను సరిదిద్దుకుంటూ, ఆ 'ఆనంద స్వరూపుని' అడుగు జాడలను అన్వేషిస్తూ, సాయి అనే విరాట్ స్వరూపాన్ని ఎవరికి వారిదే అయిన మార్గంలో శోధిస్తూ, అనుభవిస్తూ ఆనంద సాయి పదాలను చేరేందుకు ఒక మహత్తర వేదికనిచ్చారు- ఆ వరదాయి ప్రత్యక్ష సన్నిధి లభించనపుడు వారి జీవితచరిత్రలతో సాంగత్యమే ఆ దివ్యసన్నిధి అని తెలియచెప్పారు. అలా సత్సంగాన్ని, 'సద్గ్రంథాన్ని' ప్రసాదించారు. అలా దుఃఖహేతువులైన వ్యక్తిత్వపు పరిమితులను ఎలా దాటాలో దారి చూపారు. ప్రతీ సందర్భంలో మనిషి దైవంగా ఎదిగే క్రమానికి అడ్డుపడే వ్యక్తిత్వపు పరిమితులను దగ్ధం చేసుకోవడానికి భజననే మొదలు - చివరలుగా, అడిగినంతనే గ్రక్కువ వరములిచ్చెడి శ్రీసాయి ప్రేమ సరళిని అవగతం చేసుకునే క్రమంలో మన హృదయాలను ముగ్ధం చేసుకుంటూ, సాయిస్మరణలో నిలుస్తూ, సర్వత్రా నిండిన శ్రీసాయిలో కలుస్తూ సాగే భజనను ప్రసాదించారు. అలా సాయి చెప్పిన "దేవుని నామం ఉచ్చరించు" అనే సాయి శ్రుతి వాక్యాన్ని ఎలా ఆచరించాలో, క్షమించాలి ఆచరించి చూపారు.

"మా సాంప్రదాయమే వేరు" అన్నారు కదా శ్రీసాయి. అట్టి సత్సంప్రదాయాన్ని అనుక్షణం మనకు గుర్తు చేయడానికే అవతరించారు శ్రీసాయినాధుని శరత్‌బాబూజీ. అంతటా ఉన్న బాబాను పొందేందుకు- అందరిలోనూ శ్రీసాయిని దర్శించిన ఆ పరమపావనుని ఆచరణను అడుగుజాడలుగా



చేసుకుని వారి ఆరాధనా మహోత్సవానికి కృతజ్ఞతా కుసుమాలను సమర్పించుకుందాం. దుర్గుణాల రోగాలు లోపల పెట్టుకుని ఆది వైద్యుడైన ఆ మహితాత్ముడు ఇచ్చిన మందులు (ఉపకరణాలు) వల్లె వేస్తూ, మందులు వేసుకోకుంటే రోగం తగ్గేదెట్లా? మందు వేసుకుంటే గుణం కనిపించాలి కదా? అలానే ఉపకరణాలను, వారి జీవన విధానాన్ని వంట బట్టించుకుంటే నిత్య జీవితంలో మార్పు కనపడాలి కదా! అంతరంగాన్ని క్షాళన చేసుకుంటూ, ఆచరణలో మార్పు తెచ్చుకుంటూ, అందరిలో శ్రీసాయి చూపిన వారి బాటన మనము నడుస్తూ, మన చుట్టూ ఉండే ప్రతీ జీవిలోనూ ఆనందపు ఛాయలకు మనమూ అర్థమై నిలుస్తూ, అడుగడుగును ఆ సత్ప్రేమమూర్తి వైపేనా నా అడుగు అని ప్రశ్నించుకుంటూ, గడిపే యాభై ఒక్క వారాల 'విశ్లేషణా పుష్పాలు'–మనం జరుపుకునే ఆరాధనా మహోత్సవాల వేళ ప్రతి నిత్యం వారి చరణాలకు సమర్పించే 'అవగాహనా పుష్పాలు'గా నిలిచిపోగలవు. ఎన్ని వసంతాలైనా ఈ పుష్పాలు సౌరభాన్ని వెదజల్లుతూనే ఉంటాయి. ఆ చరణాల చెంత శాశ్వతంగా ఉండిపోతాయి. అంతకంటే మనం ఆశించేదేముంది. పదండి, ఆలోచిద్దాం – ఆరాధనను శ్రద్ధా భక్తులతో చేసుకుందాం.

**– గురుకృప**

## అన్వేషణ...ఆత్మపరిశీలన..ఆరాధన

ఒకే నదిలోనికి రెండుసార్లు అడుగుపెట్టలేమంటాడు హెరాక్లైటిస్ అనే గ్రీకు తత్వవేత్త. నిరంతరం చలనశీలమైన నదీ ప్రవాహంలో మనం దోసిళ్ళు పట్టిన ప్రతిసారీ మనం స్పృశించేది క్రొత్త నీటినే. **ఆ ప్రవాహ ఝరిలో పాతదనానికి చోటు ఉండదు. గతం వర్తమానాన్ని ప్రభావితం చేయదు. వర్తమానం భవిష్యత్తుని నిర్దేశించదు.** అటువంటి జీవనదీ ప్రవాహ సదృశ్యం పూజ్యగురుదేవులు సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ. ఎంత దగ్గరగా ఉన్నవారికైనా, ఎన్ని అనుభవాలున్న వారికైనా, ఆయన గురించి ఎంత తెలిసిన వారికైనా, ఆయన సాన్నిధ్యం అనుక్షణం క్రొత్తగానే ఉండేది.

శ్రీబాబూజీ సాన్నిధ్యం మాత్రమే కాదు. సత్సంగాలలో వివిధ ప్రశ్నలకు ఆయనిచ్చే సమాధానాలలో క్రొత్తదనం ప్రస్ఫుటంగా గోచరించేది. గురువుగారితో ఎన్నో సంవత్సరాల సాహచర్యం ఉన్నవారు సైతం ఆయన ఇచ్చే సమాధానాలను, వివిధ సందర్భాలలో ఆయన స్పందించే తీరును అంచనా వేయలేకపోయేవారు. ప్రశ్న పాతదైనా, ప్రశ్నించే వ్యక్తులు పాతవారైనా సమాధానంలో ప్రతిసారీ ఏదో క్రొత్తదనం కనిపించేది. గురువుగారు ఏమి చెప్తారో మాకు తెలుసు. గురువుగారు ఏమి చేస్తారో



మాకు తెలుసు అనే అభిప్రాయాలకు శ్రీబాబూజీ వద్ద ఎన్నడూ తావులేదు.

సద్గురువు మనకు అత్యంత ఆప్తులుగా అనిపించడం. అదే సమయంలో మార్మికమైన అపరిచిత భావమూ ఉండటం జరుగుతుందని శ్రీబాబూజీ ఎన్నో సందర్భాల్లో చెప్పేవారు. తాము శ్రీసాయిదరికి చేరి దశాబ్దాలు గడిచినా బాబా గురించి ఇంకా తెలియనిదేదో ఉందనిపిస్తుంది అనేవారు. అందుకే సాయిపథంలో సాగే వారిని సాయి సీకర్స్ (సాయి అన్వేషకులు) అన్నారు శ్రీబాబూజీ. విశ్వరూపుడైన సద్గురునాథుని ఆరాధనకు వ్యక్తీకరణగా అన్వేషణ సాగుతుంటే ప్రతి సందర్భం సరికొత్త అనుభవమై శోభిస్తుంది, సద్గురు ప్రబోధమై దీపిస్తుంది.

సద్గురువు గురించి “నాకు తెలుసు” అనుకున్న మరుక్షణం అన్వేషణకు తెరపడుతుంది, ఆరాధన యాంత్రికమవుతుంది. మనకు తెలిసిందే సత్యం అనుకుని అన్వేషణ ఆగినపుడు వివేకం, విచక్షణ మరుగున పడి మనం నిజాలని భావించే ‘అభిప్రాయాలు’ నమ్మకాలుగా మారి మన అహంలో భాగమై స్థిరపడిపోతాయి. ఆపై అహాన్ని కాపాడుకోవడానికి, మన నమ్మకాలే సత్యమని నిరూపించడానికి, నిత్యజీవితంతో సమన్వయం చేసుకోవడానికి, ఇతరుల నమ్మకాలతో గల వైరుధ్యాలను పరిష్కరించుకోవడంలోనూ కాలం గడిచిపోతుంది. సద్గురువుని తెలుసుకోవాలని, వారిని చేరుకోవాలనే అసలు లక్ష్యం మరుగునపడి మరేవో ‘కొసరు’ విషయాలు గమ్యమవుతాయి.

సాయిఊసు సాయిధ్యాసలతో జీవితాలను శ్రీసాయిమయం చేసుకోవడం సాయిపథానికి మూల సూత్రం. దీనిని అనుసరించి ఎవరికివారు వారివారి అవసరాలను బట్టి, సంస్కారాన్ని బట్టి తమవైన మార్గాలను అన్వేషించుకోవాలని, అందరిలో ఈ పరిణితి తీసుకురావడంకోసమే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు శ్రీబాబూజీ. ఆధ్యాత్మిక స్రవంతిలో సాయిపథం విశిష్టత ఇది. నియమ నిబంధనలు పెట్టి, ప్రక్రియలు చెప్పి, చెప్పింది చెయ్యమనే సంప్రదాయం కాదు సాయిపథం. ఎవరికి వారు తమ అవసరానికి తగినట్టు మార్గాన్ని అన్వేషించుకుని, తమ అనుభవమే ప్రాతిపదికగా ముందుకు సాగడానికి తమ స్వరూపమైన సమస్త సృష్టిని ఆలంబనగా నిలిపే సద్గురు మార్గమిది.

మన మార్గాన్ని మనం ఎంచుకునే స్వాతంత్ర్యంలో స్వేచ్ఛతో పాటు ఎంతో బాధ్యత వుంది. సాయిపథాన ఆధ్యాత్మిక, ప్రాపంచిక జీవితాల మధ్య వ్యత్యాసం లేదు. సాయిపథాన ఉన్నామా లేదా అన్న ప్రశ్నకు సమాధానం–సమయం, సందర్భం మీద ఆధారపడి ఉండదు. సర్వకాల సర్వావస్థలలో జీవితం యావత్తూ సాయిభక్తి సాధనలో మార్గమే. సాయి ఊసు ధ్యాసలే పరమావధిగా సాగే



సాయియానం అహానికి ఆస్కారం లేకుండా సాగాలని కోరుకున్నారు శ్రీబాబూజీ. మన అహంకారాన్ని మరింత దృఢం చేసుకోవడానికి సత్సంగాలు, సాయి కార్యక్రమాలు వేదికలు కాకూడదనే వారు. సద్గురువు పట్ల ప్రేమకు వ్యక్తీకరణగా సాగాల్సిన కార్యక్రమాలు, వ్యక్తుల అహంకారపు ఆర్భాటాలకు ప్రతీకలుగా మారినపుడు తొలుత సద్గురువుకు చేరువ కావడానికి సాధనాలైన అంశాలు, అవకాశాలే చివరకు దూరం కావడానికీ దోహదం అవుతాయి.

సద్గురువు పట్ల అనన్యమైన ప్రేమతో సద్గురుతత్వాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడానికి మనం చేసే అన్వేషణతోపాటు, అనునిత్యం అభిప్రాయాలు, నమ్మకాలు, ఇష్టాయిష్టాల రూపంలో మనస్సులో వెలుస్తున్న అడ్డుగోడల అనుపానులు తెలుసుకోవడానికి అవసరమైన ఆత్మపరిశీలన కూడా నిరంతరం కొనసాగాలి. అటువంటి అన్వేషణ, ఆత్మపరిశీలన ఉన్నపుడు మాత్రమే "నేను–నాది" అనే అహంలో భాగమైన ప్రతి నమ్మకాన్ని, ఇష్టాయిష్టాలను, భయాలను, భ్రాంతులను ఎదుర్కోగలం. తప్పులను ఒప్పుకోగలం, సరిదిద్దుకోగలం. మనతో మనం చేసే ఈ ఆంతరంగికమైన పోరాటంలో, మధనంలో మనకు తోడుగా నిలిచేది సద్గురు ప్రేమానుగ్రహాలే, కానీ తొలి అడుగులు మనవైపునుండే పడవలసి ఉంటుంది.

జీవితాన్నే సాయి అన్వేషణగా మార్చుకున్న ఆ మహితాత్ముని ఆరాధన వేళ మనలో నాటుకుపోయిన ప్రతి అభిప్రాయాన్ని, మనకు తెలుసు అనుకున్న ప్రతి విషయాన్ని ముఖాముఖి పెట్టుకుని, మనల్ని మనం ప్రశ్నించుకుందాం. అందరినీ ప్రేమించి, ప్రేమను పంచి, ప్రేమగా నిలిచిన ఆ సద్గురుమూర్తి తత్వాన్ని మరింతగా తెలుసుకునేందుకు, అనుభవంలోనికి తెచ్చుకునేందుకు మన అన్వేషణను, ప్రయాణాన్ని సరిక్రొత్తగా ఆరంభిద్దాం. సాయిపథాన మన ప్రతి అడుగును తొలి అడుగుగా భావించి ముందుకు సాగుదాం. కిటికీ చట్రంలో ఇరుక్కుపోయిన మన దృష్టిని తనవైపుకు త్రిప్పుకునేందుకు అనంతాకాశం అంతులేని సహనంతో ఎదురుచూస్తోంది.

– సద్గురు ప్రేమ 'భీముడు'

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**  సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**

# ప్రేమవాహిని *జూలై 2014*



**గురువుగారు :** నిజమైన ప్రేమ వ్యక్తీకరణ కోరుతుంది.

**భక్తుడు** : మా ప్రేమను వ్యక్తం చేయడానికి ఉన్న మార్గాలు ఏమిటి?

**గురువుగారు :** ముందు, ప్రేమను అనుభూతి చెందండి. ఆ తర్వాత వ్యక్తం చేయడం (ప్రేమను వెలిబుచ్చడమనేది) దానంతట అదే వస్తుంది. ప్రేమను వ్యక్తం చేయడానికి ప్రతి ఒక్కరికీ తమదైన మార్గం ఉంటుంది. ఇంట్లో అయిదుగురు పిల్లలు ఉంటే అయిదుగురూ ఒకేరకంగా ప్రేమను వ్యక్తపరుస్తారా? వ్యక్తపరచడానికి ప్రతి ఒక్కరికీ తమదైన పంథా ఉంటుంది. ఆ వ్యక్తీకరణను తార్కికమైన విశ్లేషణల పేరుతో, హేతుబద్ధత పేరుతో అణగద్రొక్కకుండా, ప్రతిఘటించకుండా ఉంటే చాలు. నేను భావోద్వేగానికి ఎక్కువ ప్రాముఖ్యతను ఇవ్వడానికి కారణం తర్కానికి, తార్కిక విశ్లేషణలకు భయపడి కాదు. ఎందుకంటే వాటికి పరిమితులున్నాయని, అవి పరిపూర్ణం కాదని నాకు తెలుసు. తల్లి తన బిడ్డను ఎటువంటి షరతులు లేకుండా ప్రేమిస్తుంది. దానికి కారణాలుగానీ, విశ్లేషణలుగానీ ఉండవు.

నిజమైన భద్రతాభావం ప్రేమ నుండి వస్తుంది. నమ్మకం భద్రతా భావాన్నిస్తుందని అందరూ అనుకుంటారు. కానీ అది నమ్మకం వలన రాదు, ప్రేమ వలన వస్తుంది. ప్రేమ నమ్మకాన్నిస్తుంది. తల్లీబిడ్డల మధ్య అనుబంధానికి కారణం నమ్మకం అనుకుంటున్నారా లేక ప్రేమనుకుంటున్నారా? బిడ్డకు తల్లిమీద అంతులేని నమ్మకం ఉంటుంది.ఎందుకని? ఎందుకంటే ఆ తల్లికి పుట్టిన బిడ్డ కాబట్టి. తాను తల్లిని ప్రేమిస్తుంది, తల్లిమీద ఆధారపడుతుంది, అంతే. బిడ్డకు ఆ నమ్మకానికి ఎటువంటి కారణాలుండవు, తర్కవితర్కాలు, సిద్ధాంతాలు ఉండవు. ఆ నమ్మకం తల్లి యొక్క అర్హతానర్హతల మీద ఆధారపడి ఉండదు.

**భక్తుడు** : కానీ ప్రేమ పెరగడానికి సమయం పడుతుంది కదా?

**గురువుగారు :** ప్రేమను వ్యక్తపరచినపుడు అది పెరుగుతుంది, దానంతట అదే పెరగదు. ముందు మనలో ప్రేమ ఉందని గుర్తించాలి, తరువాత దానిని ఎంతగా వ్యక్తపరుస్తామో అది అంతగా పెరుగుతుంది. భక్తిగా మనం చేసే పూజావిధులన్నీ ఏమిటి? అవన్నీ మన ప్రేమకు వ్యక్తీకరణలే. ఉదాహరణకు, తండ్రి ఆఫీసు నుండి ఇంటికి వచ్చేటపుడు తన పాప కోసం ఒక డ్రస్సునో, ఒక బొమ్మనో తీసుకువస్తాడు. కానీ ఆ పాపకు ప్రత్యేకంగా బొమ్మకావాలనో, డ్రస్సు కావాలనో ఉండదు.



కానీ తన తండ్రి తనకు ఏదో ఒకటి ఇవ్వాలి అనుకొంటుంది. తండ్రి ఎంతగా ఇస్తూ ఉంటాడో అంతగా ఆ పాపకు తండ్రితో అనుబంధం పెరుగుతుంది. "నా ప్రేమ నా గుండెల్లో ఉంటే చాలు, బయటకు చూపించాల్సిన అవసరం లేదు. అయినా అసలు ఇలా చూపించవలసిన అవసరమేమిటి?"... ఏ తండ్రి అయినా ఇలా అనుకొంటాడా? ఒకవేళ ఆ తండ్రి తన ప్రేమను వ్యక్తం చేయకపోతే, తన బిడ్డను తాను అలా దగ్గరకు తీసుకొని ముద్దుచెయ్యకపోతే కొంతకాలానికి తన ప్రేమ పొడిబారిపోతున్నదన్న విషయం అతనికే అర్థమవుతుంది. అందుకే ప్రేమను ఎప్పుడూ వ్యక్తం చేయాలి. ఈ పూజావిధులు, నమస్కారం చేయడం, అగరుబత్తీలు వెలిగించడం, పువ్వులు సమర్పించడం... ఇలా భక్తి వలన వచ్చిన ఇవన్నీ కూడా ప్రేమ నుండి పుట్టినవే. ప్రేమను వ్యక్తం చేస్తున్నంత వరకు అవి నిజమైన పూజావిధులు, అలా కాకపోతే వాటికి విలువే లేదు. మనం చేసే పని ఏదైనా మన ప్రేమను వ్యక్తం చేస్తున్నంతవరకు అది పూజే అవుతుంది.

**భక్తుడు** : గురువుగారూ! భక్తి దానంతట అదే కలుగుతుందా? లేక మనం పెంపొందించుకోవాలా?

**గురువుగారు :** మనలో భక్తికి తొలి ప్రేరణ సహజంగానే కలగాలి. ఒక్కసారి అది మనలో మొలకెత్తాక దానిని రకరకాల మార్గాలలో పెంపొందించుకోవచ్చు. మనమెవరినైనా ప్రేమించినపుడు ఆ ప్రేమను వ్యక్తపరచడానికి చేసే పనులనే, తిరిగి మళ్ళీ మనం చేసినపుడు మనలో అదే భావోద్వేగం కలుగుతుంది. ఉదాహరణకు, ఎవరైనా ఆనందపారవశ్యంలో ఒక అందమైన రాగాన్ని స్వరపరచి దానిని మీకు వయొలిన్ మీద వినిపిస్తే, మీరు కూడా అదే పారవశ్యానుభూతిని పొందగలుగుతారు. ఒక తండ్రికి తన బిడ్డపట్ల ప్రేమ కలిగినపుడు, బిడ్డను దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకుంటాడు. అది ఆయన ప్రేమకు సహజమైన వ్యక్తీకరణ. కానీ అతనికి అంతటి ప్రేమభావన లేనప్పుడు కూడా తన బిడ్డను దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకున్న మరుక్షణం అతనిలో అదే ప్రేమానుభూతి కలుగుతుంది.

**భక్తుడు** : అంటే మనం చేసే పనులు భావోద్వేగాన్ని కలిగిస్తాయా?

**గురువుగారు :** అవును. కేవలం భక్తి విషయంలోనే కాదు. మీరు చేసే ప్రతి దాంట్లో ఈ విషయాన్ని చూడవచ్చు. మనం చేసే పూజావిధులకు అర్థమిదే. మీలో భక్తి భావాన్ని కలిగిస్తున్నంతవరకు మనం చేసే ఆ పూజావిధికి అర్థముంటుంది. పూజావిధుల యొక్క ఉద్దేశ్యమిదే. పూజావిధులన్నీ ప్రేమకు వ్యక్తీకరణలుగానే మొదలయ్యాయి. అవన్నీ కూడా ఒక విధమైన భావోద్వేగాన్ని వ్యక్తం చేసేవే. వాటిని తిరిగి తిరిగి చేయడం ద్వారా మనలోనూ అదే భావోద్వేగం కలుగుతుంది.



**భక్తుడు** : కానీ అవి కొన్నిసార్లు యాంత్రికమవుతాయి కదా?

**గురువుగారు :** అవి యాంత్రికమైతే ఆ పూజావిధులకు అర్థం లేదు. అప్పుడు వాటిని మీరు వదిలి పెట్టేయవచ్చు. కానీ కొన్నిసార్లు అవి అర్థరహితమైనవిగా కనిపించినప్పటికీ మనం వాటిని తిరిగి తిరిగి చెయ్యడం ద్వారా అవి మనలో భక్తిభావాన్ని కలిగించవచ్చు. మనలో ప్రేమను రగిలించి, దానిని సంరక్షించుకోవడానికి ఇంకే దారీ లేనపుడు, మనకుండే చిట్టచివరి మార్గమిదే.

**భక్తుడు** : మీరు తరచుగా గురువుకి, భక్తుడికి మధ్య సంబంధం తల్లికి, బిడ్డకి మధ్య ఉండే సంబంధం లాంటిది అని అంటారు. అయితే మేము ఎప్పటికీ ఒక బిడ్డగానే ఉండిపోతామా? అసలు ఈ బిడ్డ ఎప్పటికైనా ఎదుగుతుందంటారా, గురువుగారూ?

**గురువుగారు :** మనమంతా పిల్లలమే. ఎదిగిపోయిన పిల్లలం! (నవ్వులు...) మీరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, మీకు నచ్చినా, నచ్చకపోయినా మిమ్మల్ని నేను పిల్లల్లాగే చూస్తాను. ఓ బిడ్డ నిజంగా ఎప్పుడు బిడ్డ అవుతుందంటే తల్లితో (ఆ బిడ్డకు) గల అనుబంధం వలన. బిడ్డకు నిస్సహాయత, అభద్రతాభావం ఉన్నప్పటికీ అవి ఆ రకంగా వ్యక్తం కావు. తల్లి ఇచ్చే సంరక్షణను బిడ్డ తన హక్కుగా భావిస్తుంది. తల్లిపై తనకుండే ప్రేమ వలన ఆ సంరక్షణ పొందడం ఆ బిడ్డ హక్కు అవుతుంది. తల్లి పాలిచ్చినందుకు బిడ్డ ఎప్పుడైనా కృతజ్ఞతలు చెప్తుందా? అయినా తను ఎందుకు చెబుతుంది? అది తల్లి యొక్క సహజ స్పందన. అక్కడ బిడ్డకు తన నిస్సహాయత కంటే తల్లి సంరక్షణే అనుభవమవుతుంది. తల్లిగానీ, తండ్రిగానీ తనతో ఉన్నంతవరకు ఆ బిడ్డ వారితో పూర్తి అనుబంధంలో ఉండి, నిశ్చింతగా ఉంటుంది.

**భక్తుడు** : అయితే గురువుగారూ, నేను మీ సహాయాన్ని ఓ హక్కుగా కోరవచ్చన్నమాట!

**గురువుగారు :** నువ్వు పసిబిడ్డవనే భావం నీకుంటే! (గురువుగారు నవ్వుతూ..)

**భక్తుడు** : గురువుగారూ! కొన్నిసార్లు మీ దగ్గర మౌనంగా కూర్చున్నప్పుడు నా హృదయంలో ఒకలాంటి తీవ్రమైన బాధ, దుఃఖం కలుగుతుంది. నాకెందుకిలా జరుగుతోంది?

**గురువుగారు :** అది మంచిదే. కొంతమందికి తాము ఏదో పోగొట్టుకుంటున్నట్లు, ఏదో కోల్పోతున్నట్లు భావన కలుగుతుంది. అందుకని వారికి అది దుఃఖంగా అనుభవమవుతుంది. అవును, అప్పుడు బాధ కలుగుతుంది. అయినా అది మామూలు బాధలాంటిది కాదు, అది వేరొక రకమైన బాధ. ఓ



మధురమైన బాధ. అది బాధగా ఉన్నప్పటికీ మనం దానిని ఇష్టపడతాం! అందుకే కదా మీరు నా దగ్గరకు మళ్ళీ మళ్ళీ వచ్చి కూర్చుంటున్నారు. (గురువుగారు నవ్వుతూ...) అది మధురమైన బాధ ఎందుకయింది? ఆ బాధను మనం మళ్ళీ మళ్ళీ కావాలనుకుంటాం కాబట్టి. ఎప్పుడైతే అక్కడ ప్రేమ ఉంటుందో అప్పుడు ఆ బాధ బాధగా అనుభవమవ్వదు. ఉదాహరణకు, మీకు ప్రేమ ఉంది కాబట్టి ఇక్కడ, ఇంత రాత్రి, చలిలో వణుకుతూ కూర్చోవడం మీకు బాధగా అనిపించడం లేదు.

బిడ్డ, తండ్రి గుండెల మీద నిలబడి పైకి క్రిందకు ఎగురుతూ ఉంటే తండ్రికి నొప్పి కలుగవచ్చు. కానీ ఆ తండ్రి, "ఇంకా, ఇంకా, ఇంకొక్కసారి, ఇంకొక్కసారి" అంటాడు. తన బిడ్డ అలా చెయ్యడాన్ని అతను ఇష్టపడతాడు. కాబట్టి ప్రేమ ఉన్నప్పుడు విషయమంతా మారిపోతుంది. అది బాధకాని బాధ, వేదన కాని వేదన. అప్పుడు ఆ ఎడబాటు వేరుగా ఉంటుంది, ఆ వేచి ఉండటం వేరుగా ఉంటుంది.

**భక్తుడు :** గురువుగారూ! మనం చేసే పనులు మన కోసం కాకుండా భగవంతుని కోసం చెయ్యాలా? మనం అలా చేస్తే మన ప్రేమ పెరుగుతుందా?

**గురువుగారు :** ఒక పాప ఏం చేసినా తన కోసమే తను చేసుకుంటుంది. తండ్రి కోసం చెయ్యదు. తన ఆనందం కోసమే తను ఆడుకుంటుంది. కానీ తను ఆడుకునే బొమ్మలన్నీ తన తండ్రి ఇచ్చినవేనని (బహుకరించినవేనని) ఆ అమ్మాయికి తెలుసు. ఆ అమ్మాయి ఆ బొమ్మలతో ఆడుకోవడాన్ని ఎంతగా ఇష్టపడుతుందో, ఎంతగా వాటితో ఆడుకుంటుందో అంతగా తనకు ఆ బొమ్మలు ఇచ్చిన తండ్రినీ ప్రేమిస్తుంది. ఆ అమ్మాయి ఆడుకునేది బొమ్మలతోనే అయినప్పటికీ ఇక్కడ అంతర్లీనంగా ఉండే సూత్రం ఏమిటంటే వాటన్నింటినీ తనకిచ్చిన వారి పట్ల ప్రేమే. మీ జీవితం యావత్తూ ఒక బహుమతే. మీరు దానిని భగవత్ప్రసాదితమనో, ప్రకృతి ఇచ్చిన వరమనో – ఎలా అన్నా సరే – అది ఖచ్చితంగా మీ ప్రయత్న ఫలితం కాదనేది మాత్రం సుస్పష్టం. అందుకనే జీవితమనేది ఒక బహుమతి.

ఈ జీవితమనే బొమ్మతో ఆనందంగా, పారవశ్యంగా ఆడుకోండి. కానీ జీవితం మీకిచ్చిన వరం అన్న ఎరుకతో ఉండాలి. ఆ ఎరుకే మిమ్మల్ని ఒక బిడ్డలా ఉండేటట్లు చేస్తుంది. బిడ్డగా ఉన్నప్పుడు ఈ ఎరుక ఉంటుంది. కానీ ఎదిగేకొద్దీ తాను స్వతంత్రంగా ఆలోచించడం మొదలుపెట్టి, ఈ బహుమతులన్నీ తనకు వేరొకరు ఇచ్చారన్న విషయం మర్చిపోతుంది. ఆ ఇచ్చేవారే "కారణం", ఆ

కారణ ఫలితమే ఈ జీవితం. బిడ్డ పెరిగేకొద్దీ తన జీవితం తల్లిదండ్రులు ఇచ్చిన బహుమతి అనే ఈ ప్రాథమికమైన సత్యాన్ని మరచిపోతుంది.



**గురువుగారు :** సత్సంగం అనేది మనమందరం కలసి కూర్చుని మన సద్గురువుపట్ల మనకు గల ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి ఒక మిష మాత్రమే. మీకు తోచిన రీతిలో ప్రేమను వ్యక్తపరచండి, అంతే. అదే సాధన, అదే భక్తి, అదే యోగం, సేవ... మీరు దానిని ఎలాగైనా పిలవండి. మీరు ప్రేమిస్తున్న లక్ష్యంపట్ల మీరు ఎలా స్పందిస్తున్నారనేది తెలుసుకోండి. మన ప్రేమను ఎలా వ్యక్తపరచాలో, ఎలా అనుభూతి చెందాలో తెలుసుకోండి. మీరు ఎంతగా వ్యక్తపరుస్తారో, అంతగా ఆ ప్రేమను అనుభవంలోనికి తెచ్చుకోగలుగుతారు. అందుకే ప్రేమను వ్యక్తపరచడం అవసరం.

**భక్తుడు** : గురువుగారూ! నేను మనస్సును ఏకాగ్రం చేయాలనుకొంటాను. కానీ నా మనస్సు నిరాకరిస్తుంది.

**గురువుగారు :** మనస్సును ఏకాగ్రం చెయ్యడానికి నేను వ్యతిరేకం కానప్పటికీ, నేను దానికి అంత ప్రాముఖ్యతనివ్వను. నేను హృదయానికి, భావోద్వేగానికి, ప్రేమకు ప్రాధాన్యతనిస్తాను. మన భావోద్వేగం ఎక్కడ (ఏ విషయంపట్ల) బలంగా ఉంటుందో అక్కడ మన మనస్సు అప్రయత్నంగానే లగ్నమవుతుంది. ప్రేమ నుండి ఏకాగ్రత వస్తుంది. మీరు బాబాను ఒకసారి నిజంగా ప్రేమించడం మొదలుపెడితే మీ ఆలోచనలన్నీ ఎప్పుడూ బాబా మీదనే కేంద్రీకృతమవుతాయి. మనం ఎవరినైతే ప్రేమిస్తామో వారి మీదనే, దేనినైతే ఇష్టపడతామో దాని మీదనే మనస్సు లగ్నమవడమనేది మనస్సు చేసే పని, అది దాని సహజధర్మం. అక్కడ మనం చేసే ప్రయత్నమేముంటుంది? ఉదాహరణకు ఒక అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడనుకొందాం. అతను ఎప్పుడూ ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తూ ఉంటాడు. అతను ప్రతి అమ్మాయిలో తను ప్రేమించిన అమ్మాయినే చూస్తాడు. అతను ఆ అమ్మాయిని మరచిపోలేడు. ఇక దేనిమీదా దృష్టిపెట్టలేడు. అది చదువుకావచ్చు, వ్యాపారం కావచ్చు, రోజువారి పనులు కావచ్చు – అతని మనస్సంతా ఆ అమ్మాయి మీదే ఉంటుంది. ఇంతటి ఏకాగ్రచిత్తాన్ని సాధించడానికి అతను చేసిన యోగమేంటి? (గురువుగారు నవ్వుతూ...) ఏమీలేదు! కేవలం అతను ప్రేమిస్తున్నాడంతే. మీకు అంతటి ప్రేమ ఉంటే ఏకాగ్రత దానంతటదే వస్తుంది, ఎందుకంటే అది ప్రేమ యొక్క పర్యవసానం.

**భక్తుడు** : గురువుగారూ! మనలో ప్రేమను పెంచుకోవడమెలా?



**గురువుగారు :** ప్రేమను వ్యక్తం చేయడం ద్వారా, అనుభూతి చెందడం ద్వారా పెంచుకోవచ్చు. ప్రాపంచికంగా ప్రేమ విషయాన్నే తీసుకోండి. ఒక అబ్బాయి, అమ్మాయి ఒకరినొకరు చూసుకున్నారు. తొలిచూపులోనే వారిలో ఏదో స్పందన కలుగుతుంది. వారిని ఒకరినొకరు ఇష్టపడతారు. విషయం అంతటితో ఆగిపోతుందా? ఆగదు. ఇద్దరూ మాట్లాడుకొని ఒకరోజు రెస్టారెంట్‌కు వెళతారు. మొదట అది అరగంట, తరువాత రెండు గంటలు, తరువాత మూడు గంటలవుతుంది. నిరంతర సాహచర్యం వలన ప్రేమ పెరుగుతుంది. ఆ తరువాత ఒక దశలో వారు ఒకరినొకరు వదిలి ఉండలేక ఇంకా దగ్గర కావాలని అనుకొంటారు. ఒకరిపట్ల ఒకరు తమ ప్రేమను వ్యక్తం చేయాలనుకొంటారు. "నీకు తెలుపురంగు ఇష్టమా? అయితే నేను తెలుపు డ్రస్సు వేసుకుంటాను". ఇలా ఎప్పుడూ తాను ప్రేమించే వ్యక్తిని సంతోషపరచడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. అలా వాళ్ళ ప్రేమను వ్యక్తపరుస్తారు. అలా ప్రేమను వ్యక్తం చేసేకొద్దీ అది మరింతగా అనుభవమవుతుంది. ఆ ప్రేమ ఎంతగా పెరుగుతుందంటే, "నువ్వు లేకుండా నేను ఉండలేను. నువ్వే నా జీవితం, నేనంటూ లేకుండా నేనే నువ్వైపోవాలని ఉంది'' అనే స్థాయికి చేరుకుంటుంది. (గురువుగారు నవ్వుతూ...) సాధారణంగా లౌకికమైన ప్రేమలో ఇలాగే ఉంటుంది కదా? భక్తిపూర్వకమైన ప్రేమలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

కాబట్టి నిరంతర సాంగత్యం (కాంటాక్ట్) వలన అనుబంధం, ప్రేమ పెరుగుతాయి. మీకు అనుభవమైన ఆ ప్రేమను – ఆ మిణుకుమిణుకుమనే చిన్న దీపం లాంటి ప్రేమను నిలుపుకోవడానికి నిరంతర సాంగత్యం (కాంటాక్ట్) అవసరం. మీరు చాలారకాలుగా ఆ సాంగత్యంలో ఉండవచ్చు.

**భక్తుడు :** కొన్నిసార్లు నాకూ నా సద్గురువుకూ మధ్య దూరం ఎక్కువగా ఉందనిపిస్తుంది. అంతరంగంలో కూడా నాకు ఇంకా చేరువ కావాలని ఉంది.

**గురువుగారు :** అది మంచిదే. సాన్నిహిత్యాన్ని కోరుకోవడమనేది ప్రేమ లక్షణం. మన లక్ష్యంతో (సద్గురువుతో) ఒక్కటయ్యేదాకా అలా అనిపిస్తూనే ఉంటుంది. శ్రీరామకృష్ణులు, కాళీమాత విషయాన్నే తీసుకోండి. శ్రీరామకృష్ణులు కాళీమాతకు పూలతో పూజ చేస్తూ చేస్తూ కొంతసేపటికి ఆ పూలను తమ మీదే వేసుకునేవారు. కాళీమాత తమలోనే ఉన్నట్లు ఆయన ఎంత గాఢంగా అనుభూతి చెందేవారంటే ఆయనకు తమకు, కాళీమాతకు భేదం తెలిసేదికాదు. ఆ కాళీమాతకు పూలను అర్పిస్తున్న ఆయన చేయి అప్రయత్నంగా ఆయనవైపుకు తిరిగేది. కానీ అక్కడ ఆయన తమను



తాము పూజించుకోవడం లేదు, కాళీమాతనే పూజిస్తున్నారు. కాళీమాత తనలోనే ఉన్నట్లు ఆయన ఎంత ప్రగాఢంగా అనుభూతి చెందేవారంటే ఆయన ఆమెతో సంపూర్ణమైన తాదాత్మ్యాన్ని పొందేవారు.

**భక్తుడు :** మా సద్గురువును కలుసుకున్నప్పుడు ఆయన పట్ల మా ప్రేమ మొదలయింది. అది ఆరంభమైతే, మరి దీనికి ముగింపు ఏమిటి?

**గురువుగారు :** మనవైపు నుండి అది ఆరంభమే. సుదీర్ఘమైన తుదిలేని ప్రేమకథకు ఆరంభం. నేను ఇంతకుముందు చెప్పినట్లుగా మనం ఆయనతో ఒక్కటయినప్పుడే దానికి ముగింపు. ఏ ప్రేమకథైనా – ప్రాపంచికమైన ప్రేమైనా సరే చివరి గమ్యం ఏమిటి? ప్రేమించిన వ్యక్తితో ఒక్కటవ్వడమే కదా! సద్గురువు విషయంలోనైనా అంతే. కానీ అది మరింత ప్రగాఢంగా ఉంటుంది.

**భక్తుడు :** అంటే, ప్రారంభంలో మనకు అనుభవమయ్యే ప్రేమకు, చివరలో మనకు అనుభవమయ్యే ప్రేమకు తేడా ఉంటుందా?

**గురువుగారు :** లేదు, తేడా ఏమీ ఉండదు. అది ఒక సాధన లాంటిది కాదు. ప్రారంభంలో మనలో కలిగిన ప్రేమ చాలా అస్పష్టంగా, అవ్యక్తంగా ఉంటుంది. అది ఇంకా ఇంకా స్పష్టతను సంతరించుకొంటూ పోయి చివరకు ఆ ప్రేమ మన నుండి వేరు కాదని మనకు వాస్తవపూర్వకంగా అనుభవమవుతుంది. ఈ మధ్యలో జరిగేదంతా ఆ అనుభవ వికాసమే (unfoldment) నేను దానిని ప్రేమ పెరగడమని, వృద్ధి చెందడమని కాకుండా ప్రేమ వికసించడం అంటాను.

ఒక మొగ్గ వికసించి పువ్వుగా మారుతుంది. ఆ మొగ్గ పువ్వుగా మారడానికి దానికి క్రొత్తగా ఏమీ కలవలేదు. అలాగని పువ్వు మొగ్గ నుండి వేరు కాదు. ఆ మొగ్గే పువ్వుగా వికసిస్తుంది. అందుకనే నేను దానిని 'వికసించడం' అంటాను. ముకుళించుకొని ఉన్నదేదో, మడతలలో దాగి ఉన్నదేదో నెమ్మదిగా మడతల నుండి విడివడుతుంది. అదే వికసించడమంటే. అప్పుడు మనం అందులో ఉన్నదానిని చూడగలుగుతాము. అది మరింత స్పష్టమవుతుంది. మరింత వాస్తవమవుతుంది. అదే ప్రత్యక్షం చేసుకోవడం (discover) అంటే. [ఆ మడతలు, తెరలు (cover) తీయడమే discover] మడతలూ, తెరలూ తొలగిపోయి అందులోని సత్యాన్ని దర్శించడమే సాక్షాత్కారం, ఆ మడతల నుండి సత్యాన్ని వెలికితీయడమే ముక్తి. మీరు దానిని ఎలా పిలిచినా సరే – ఏ పదాలైనా దానినే సూచిస్తాయి.



# సద్గురు సన్నిధిలో సాధన - సాటిలేని ఆనందార్చన

అమృతతుల్యమైన శ్రీసాయితత్త్వాన్ని ప్రపంచానికి అందిస్తూ, సంప్రదాయానికి సాకారమైన గురుదేవులు పూజ్యశ్రీబాబూజీ సాయిపథంలో సాగేవారికి నడయాడు దైవమే. భక్తులకు బాబూజీ సన్నిధి ఆనందవాహినియే. గురుదేవుల యొక్క సాన్నిధ్యం అనే అనుగ్రహధార జీవనదిలా సాగుతూ ఎన్నో హృదయాల ఆర్తిని తీరుస్తూ, మరెందరి జీవితాలనో సుభిక్షం చేస్తూ, సాయిబాబా అనే విశ్వచైతన్యార్ణవంలో సంగమిస్తుంది. అనంతానంతరూపుడైన సద్గురుని దివ్యశక్తి విశ్వవ్యాపకం. భక్తులు ఎప్పుడు ఎక్కడ ఏ విధంగా స్మరించినా గురువుయొక్క తక్షణ రక్షణ అందుతుంది అన్నది అక్షర సత్యం. అయినా భక్తులు తమ గురువుయొక్క భౌతిక సాన్నిధ్యానికై ఆరాటపడతారు.

**వాస్తవానికి హృదయాంతరాళాల్లోంచి వచ్చే గురుస్మరణే వారికి సాన్నిధ్యానుభూతిని ప్రసాదిస్తున్నా** గురువుయొక్క రూపంపై వారు పెంచుకున్న అవ్యాజ ప్రేమానురాగాల వలన నిరంతరం వారికి దగ్గరగా ఉండాలని పరితపిస్తుంటారు. శ్రీబాబూజీ శిరిడీలో పింపల్‌వాడీ రోడ్డులో ఒక చిన్న ఇంట్లో అద్దెకుండే రోజుల్లో వారిని కలుసుకునేందుకు వచ్చిన వారందరినీ పేరుపేరునా పలకరించి ఆప్యాయంగా వాళ్ళతో మాట్లాడి, వారి సమస్యలు విని స్వాంతన కలిగించేవారు. అలా కొన్నేళ్ళు వారి ప్రత్యక్ష సాన్నిధ్యం అందరికీ అందుబాటులో ఉంది. అయితే ఉప్పొంగి పొరలే గంగా ప్రవాహం చిన్న కమండలంలో బంధింపబడటం అసంభవం. అలాగే శ్రీబాబూజీ ప్రేమవాహిని ఆ చిన్ని పరిధిలో పరిమితం కాలేదు. అది వ్యాపించే కొద్దీ మెల్లమెల్లగా వందలసంఖ్యలో ఉన్న భక్తులు, సందర్శకులు వేలాదిగా అయ్యారు. శ్రీబాబూజీతో కలసి కూర్చుని ఆయన సత్సంగాన్ని వినే అవకాశం ఆ చిన్న ఇంట్లో అసాధ్యమయింది. ఈ కారణాల దృష్ట్యా భక్తులకు శ్రీబాబూజీతో ప్రత్యక్షంగా గడిపే సమయం క్రమేపీ పరిమితం కావడం మొదలయింది.

పదేళ్ళ క్రిందట శ్రీబాబూజీ సన్నిధిలో ఉండి, పారాయణ, జపధ్యానాలు, గురుస్థాన్‌లో ప్రదక్షిణలు మొదలయినవి చేసుకున్నవారు గురువుగారి సత్సంగాలను, సత్సంగాలలో వారి ఛలోక్తులను మరపురాని మధుర సంఘటనలుగా ఈనాటివారితో పంచుకుంటుంటే, అయ్యో, మేమివన్నీ పొందలేకపోయామే, అని బాధపడేవారు ఎందరో ఉన్నారీనాడు. కొద్దిరోజులు గురుదేవుల సన్నిధిలో ఉంటూ బాబా స్మరణ, బాబా పట్ల అవగాహన మరింతగా పెంచుకోవాలనే కోరికను శ్రీబాబూజీతో ఎంతోమంది నివేదించుకున్నారు. బహుశా అన్ని వేలమంది భక్తుల కోరికలకు స్పందనగా కాబోలు సత్సంగకేంద్రాల



వారీగా బాబూజీ సన్నిధిలో తడవకు 75-100 మంది చొప్పున బాబా స్మరణ చేసుకొనే అవకాశం లభించింది. ఆ క్రమంలో భాగంగా శ్రీబాబూజీ తిరువణ్ణామలైలో ఉండగా కందుకూరు, విజయవాడ, వెంకటగిరి సత్సంగసభ్యులు ఆ మహనీయుని సన్నిధిలో మూడు నాలుగురోజులుండి, బాబా స్మరణ చేసుకున్నారు. ఆ తరువాత సాయిపథంలోని యువకులకు కొద్దిరోజులు గురుసన్నిధిలో గడిపే అవకాశం లభించింది. అలాగే మాకు (మహిళలకు) మే 26,27,28 తేదీలలో గురుదేవుల సన్నిధిలో గడిపే మహద్భాగ్యం లభించింది. అన్ని సత్సంగ కేంద్రాల నుండి వెల్లువైన ఆనందంలా 25వ తేదీ సాయంత్రానికల్లా తిరువణ్ణామలై చేరిపోయాము.

26వ తేదీ ఉదయం పదిగంటలకల్లా గురువుగారున్న ఇంటి మిద్దెమీద అందరమూ అమితోత్సాహంతో కలుసుకున్నాము. అక్కడే శ్రీబాబూజీ తమ సందర్శనార్థం వచ్చే భక్తులకు దర్శనం ఇస్తారు. మా అందరి కన్నుల్లో ఆనందోద్వేగం దాచినా దాగడంలేదు. మేడపైన ఉన్న స్థలం మరీ ఏమంత పెద్దది కాకపోయినా, ఒకరికొకరం అక్కాచెల్లెళ్ళవలే సహకరించుకుంటూ సర్దుకొని కూర్చుని శ్రీబాబూజీ అంతకు కొద్దిరోజుల ముందు చేసిన సత్సంగభాషణాన్ని (ఆడియో) విన్నాము. ఆ తరువాత కొద్దిసేపు గురుదేవులు సత్సంగంలో చెప్పిన అంశాలను విశ్లేషించుకుంటూ, అవగాహన చేసుకునేందుకు ప్రయత్నం చేస్తూ గడిపాము. మధ్యాహ్నం భోజన సమయం దాటుతుందన్న ఆలోచన కూడా మాలో ఎవరికీ లేదు. ఆ వేసవి మండుటెండలు పండు వెన్నెల్లానే తోస్తున్నాయి. మరల సాయంత్రం ఆరు గంటలకు సత్సంగంలో కలుసుకుందామని అందరం మా బసల దారి పట్టాం. ఆ దారంట మమ్మల్నపుడు చూస్తున్న వారికెవరికైనా అదొక ఆనందహేలగా అనిపిస్తుంది.

సాయంత్రం ఆరు గంటలకు మొదలయిన సత్సంగంలో శ్రీసాయిసచ్చరిత్ర పారాయణ పూర్తి అయిన తరువాత అందరం నిశ్శబ్దంగా బాబా (పటము)ను చూస్తూ కూర్చున్నాము. గురుదేవుల సన్నిధిలో కూర్చున్న మా మనస్సులు అప్రయత్నంగా ధ్యానస్థమయ్యాయి. ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనలో కొట్టుమిట్టాడే అంతరంగం ఆ మహాత్ముని సన్నిధిలో మూగబోయింది. మహాత్ముల సన్నిధిలో మనస్సు తన అస్తిత్వాన్ని కోల్పోతుంది అంటారు. ఆ సమయంలో మాకది అనుభవానికి వచ్చింది. బలవంతంగా ఆలోచిద్దామన్నా ఆలోచనలు రాని స్థితి అది. ఇంతలో రూపుదాల్చిన ఆనంద స్వరూపంలా ధవళ వస్త్రాలతో శ్రీబాబూజీ మేడపైకి వచ్చారు. ఎప్పుడో శిరిడీలో తప్ప వారిని చూడబోము అనుకున్న మా అందరికీ ఆ దర్శనం ఎంత ఆనందదాయకంగా ఉందంటే మాటలలో



ఆ దివ్యానుభూతిని వర్ణించలేము.

గురుదేవుల దర్శనానంతరం రాత్రి తొమ్మిది గంటలకు గురుబంధువులందరం భోజనాలు ముగించుకొని కలిసికట్టుగా సాయినామస్మరణతో గిరి ప్రదక్షిణ ప్రారంభించాం. ఎందరో తపస్సంపన్నుల తపోక్షేత్రమైన అరుణాచలానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. అరుణాచలంపై ఎంతోమంది మహాత్ములు నివసిస్తుంటారని వారి కృపాకటాక్షవీక్షణాలతో ఎన్నో జన్మల సంస్కారాలు, బలహీనతల నుండి ఒక్క క్షణంలో విముక్తులం కాగలమని భగవాన్ శ్రీరమణమహర్షి అనేవారు. బాబాకు, గురువుగారికి జయజయధ్వానాలు చేస్తూ మొదలుపెట్టిన మా సాయినామోచ్చారణ గిరిప్రదక్షిణ ప్రారంభంలో ఏ స్వరంలో ఉండినదో 14 కి.మీ. దూరం నడచి వచ్చి ప్రదక్షిణ పూర్తి చేసేంత వరకు అదే స్వరంలో ఉందంటే మా అందరిలో ఎంతటి ఉత్సాహం ఉందో వేరే చెప్పనక్కరలేదనుకుంటాను.

రాత్రి శ్రీసాయినామ సంకీర్తనతో ఆ గిరిప్రదక్షిణ మార్గమంతా నినదించిపోయిందన్నా అతిశయోక్తి కాదు. మాలో ఎప్పుడూ ఇంటి పనులతో సతమతమవుతూ ఏ మాత్రం వ్యాయామము–నడక అలవాటు లేనివారు, నలభై–యాభై సం॥లు దాటిన స్త్రీలు కూడా అనాయాసంగా అంత గిరిప్రదక్షిణ చేసి వచ్చి ఆ తర్వాత అసలింత దూరం మేమెలా నడిచామో మాకే తెలియదు, బాబా గురుదేవుల అనుగ్రహ బలమే మమ్మల్ని నడిపించింది సుమా! అని ఆశ్చర్యపోతుంటే చూసినవారికి అదొక అద్భుత లీల అనిపించక మానదు. రెండవరోజు ఉదయం స్కందాశ్రమము, విరూపాక్ష గుహను సందర్శించుకున్నాం. మాతోపాటు శ్రీబాబూజీ సతీమణి శ్రీమతి అనసూయమ్మగారు కూడా రావడం మాకెంతో ఆనందదాయకమయింది. ఆ రోజు సాయంత్రం మరల సత్సంగం, గురుదేవుల దర్శనానంతరం, రాత్రి భోజనాలు చేసుకొని, అందరం తిరువణ్ణామలైకి 40 కి.మీ.ల దూరంలో ఉన్న పూండీకి బయలుదేరాం. పూండీకి చేరిన తర్వాత కొందరు గురుబంధువులు పూండీస్వామి ఆలయంలో స్వామి సమాధికి ప్రదక్షిణలు, మరికొందరు జపధ్యానాదులు చేసుకొంటుండగా, మరికొందరు ఆ ఆవరణలో నిద్రకు ఉపక్రమించారు. శ్రీపూండీస్వామి సశరీరంతో ఉండగా, గురువుగారు సాధన చేసుకున్న ఆ ప్రదేశాన్ని చూడగలగడం అంటేనే అదెంతో అదృష్టంగా అనిపించింది. అక్కడ ప్రదక్షిణలనంతరం శ్రీపూండీస్వామి గురించి శ్రీనివాసులరెడ్డిగారు వివరించగా, రాధాకృష్ణగారి సత్సంగం ప్రశ్నోత్తరాలతో సాగింది.



"సాయివంటి దైవంబు లేడోయి, లేడోయి" అంటూ "ఒకే దైవం, ఒకే ధ్యానం, ఒకే ధ్యేయం సాయిబాబా" అని కదా శ్రీబాబూజీ చెప్తారు. మనందరి ఉపాసనాదైవం బాబానే కదా. మరిప్పుడు గురువుగారే మనల్నిలా పూండీస్వామి దగ్గరకెందుకు పంపించారు? అని మాలో ఒకరు ప్రశ్నించారు. "నిజమే సాయిపథగాములకు పెదవులపై సాయిబాబా నామం, హృదయంలో శ్రీసాయిరూపం ఉంటాయి తప్ప అన్యం కాదు, వారెక్కడికి వెళ్ళినా సాయినే వారు దర్శించేది. మరే పుణ్యక్షేత్రాలకెళ్ళినా, మరే దైవాన్ని దర్శించినా అక్కడ చూసేది, అనుభవించేది శ్రీసాయి సాన్నిధ్యాన్నే. మనమంతా ఇక్కడకు వచ్చి పూండీస్వామి చుట్టూ ప్రదక్షిణలు చేసుకుంటున్నా, స్మరిస్తోంది బాబానే కదా! **గురువు ఆదేశం ప్రకారం ఎక్కడకు వెళ్ళినా ఆ ప్రదేశం యొక్క విశిష్టత కాదు చూడవలసింది గురువచనాన్ని వినమ్రతతో శిరసావహించడమన్నదే ముఖ్యం.** ప్రత్యేకించి మనమిప్పుడు పూండీకి వచ్చాం అంటే గురువుగారి ఆదేశాన్ని పాటించడమే తప్ప మరో కారణమేమీ లేదు. నేనెందుకు తిరువణ్ణామలైకి, పూండీకి వస్తానంటే మా గురువుగారున్నారు కాబట్టి వస్తున్నాను, ఎందుకు గిరి ప్రదక్షిణ చేస్తానంటే ఆయన చేయమన్నారు కాబట్టి చేస్తున్నాను" అంటూ వివరించారు శ్రీరాధాకృష్ణ.

"ఖండోబా ఆలయంలో ఉండు. నీవు చేయవలసిందేమీ లేదు" అని శ్రీఉపాసనీతో బాబా అన్నా అక్కడాయనకు లభించింది బాబా అనుగ్రహమే కదా. అంతేకాదు, **గురుపౌర్ణమి రోజున బాబా మసీదులోని ఒక స్తంభాన్ని చూపి పూజించమన్నారు. అక్కడ పూజనీయం స్తంభం కాదు, సద్గురు వాక్యమే!**

ఒక సత్సంగంలో "గిరి ప్రదక్షిణకు, పూండీకి వెళ్ళమంటున్నారు, మనకు బాబానే సర్వస్వం కదా గురువుగారు" అని ఒక భక్తుడు ప్రశ్నించాడు. అప్పుడు శ్రీబాబూజీ "అవును, మనకు బాబానే సర్వస్వం, బాబానే గమ్యం, బాబా భక్తులు ఎక్కడకు వెళ్ళినా బాబానే ధ్యానించాలి. తిరువణ్ణామలై, పూండీ మహాత్ములున్నటువంటి స్థలాలు, వాళ్ళ సన్నిధిలో మనకు బాబా స్మరణ ఇంకా చక్కగా కుదిరే అవకాశముంది. ఇక్కడ వాతావరణం ఎట్లా ఉంటుందంటే త్వరగా మన మనస్సు ధ్యానస్థమవటానికి ఉపయోగపడుతుంది. వాళ్ళ యొక్క సన్నిధి ప్రభావాన్ని ఉపయోగించుకొని బాబా స్మరణ, బాబా ధ్యానాన్ని ఇంకా ఎక్కువ చేసుకోవాలి. మనం సాయిపథం అనే పడవలో ప్రయాణం చేస్తున్నాము. మనమీ క్షేత్రాలకొచ్చినపుడు ఆ స్థల ప్రభావం గాలివాటుకెత్తిన తెరచాపలా ఉపయోగపడి

**బాబాకు ఇష్టం లేని పని చేయడం వలన బాబాకు దగ్గర కాలేము. - శ్రీబాబూజీ**



మన ప్రయాణం మరింత త్వరితమవుతుంది. మనం ఇక్కడకొచ్చింది **బాబాను మన మనస్సుకు మరింత దగ్గరకు చేసుకోవడానికే"** అన్నారు.

మూడవరోజు సాయంత్రం సత్సంగం. గురుదర్శనమయ్యాక మా అందరికీ తెలిసిన వార్త. మరికొద్దిసేపట్లో గురువుగారి సత్సంగం ఉంటుందని, అప్పటికి గురుదేవులని ఎన్నోసార్లు దర్శించుకున్న వారిలోనూ ఇంతవరకు వారి కంఠస్వరం విననివారు ఎందరో ఉన్నారు. అటువంటిది గురువుగారు మా అందరితో మాట్లాడతారని స్వయంగా మా సందేహాలు తీరుస్తారని విన్న మా ఆనందం పట్టనలవి కాలేదు. ఆ పూట భోజనం మాట కూడా మరచిపోయి అక్కడే గురుదేవుల రాకకై ఎదురుచూస్తూ కూర్చున్నాము. మేమెంతోసేపు నిరీక్షించాల్సిన పని లేకుండానే గురువుగారు వచ్చి బాబాకు నమస్కరించుకుని తమ ఆసనంలో ఆసీనులయ్యారు. ఎప్పుడూ దర్శన సమయంలో ధ్యానస్థులై ఉండే వారిని అలా నగుమోముతో ప్రసన్నంగా చూడగలగడమే చాలనిపించింది కొందరికయితే. గురుదేవులు అందరి వంక ప్రేమపూరిత నేత్రాలతో వాత్సల్యంగా కలయచూస్తూ "ఊ! ఏమిటమ్మా చెప్పండి" అంటూ అడిగేసరికి ధైర్యం వచ్చి మెల్లగా తమ తమ సందేహాలు బయటపెట్టసాగారు.

సత్సంగంలో ఒకరడిగిన ప్రశ్న "గురువుగారూ! మనకు దైవం బాబానే కదా! మరి మీరెందుకు తిరువణ్ణామలైలోనూ, తిరుమలలోనూ ఉంటుంటారు". "నేను తిరువణ్ణామలైకో, తిరుమలకో, మరోచోటకెళ్ళినా ఎక్కడైనా దర్శించుకునేది, స్మరించుకునేది బాబానే. ఇక ప్రత్యేకించి ఇక్కడకెందుకొస్తాను అంటే నేను విద్యానగర్ కాలేజీలో చదువుకుంటున్నపుడు నాకు సమీపంగా ఉండే క్షేత్రమిదే. సెలవులు వచ్చినపుడు శిరిడీకి పోవడానికి చార్జీలకు డబ్బులుండేవి కావు. తిరువణ్ణామలైకి వచ్చిపోవడానికి ఆ రోజుల్లో పదహారు రూపాయలుంటే సరిపోయేది. అందుకని ఇక్కడకు వచ్చి బాబా స్మరణ చేసుకునే వాడిని. ఇది నాకు గత 30, 35 సంవత్సరాల నుండి తెలిసి ఉన్న ప్రదేశం. ఇప్పుడు శిరిడీలోని జనసమూహాన్నించి కొద్దికాలం దూరంగా ఉందామన్నా, ఒంటరిగా కొంతకాలం గడపాలి అనిపించినపుడు అక్కడకూ, ఇక్కడకూ పోయేదానికంటే నాకు సుపరిచితమైన పవిత్రక్షేత్రం కనుక ఇక్కడకు వస్తుంటాను. అంతే తప్ప మరింకే కారణమూ లేదు" అన్నారు.

ప్రధానంగా బాబాకు ఎలా దగ్గరవడం అన్న అంశానికి సంబంధించిన వాటికే ఎక్కువ సమాధానాలివ్వబడ్డాయి. ప్రశ్నను ఎలా అడిగినా గురుదేవుల ఇచ్చిన జవాబులు మాత్రం అన్నీ



అటు తిరిగి ఇటు తిరిగి బాబా వద్దకే వచ్చి ఆగాయి. మా సందేహాలెన్నో సమాధానపడటమే కాదు, బాబా స్మరణ, పూజ వంటి వాటికి సరికొత్త కోణాలలో సరైన అర్థాలు తెలిసాయి మాకు. అంతేకాదు ఆ మిషతో కొన్ని గంటలపాటు సద్గురు దివ్యసన్నిధిని ప్రసాదించిన ఆ సత్సంగాన్ని ఒక మధురస్మృతిగా మేమందరం మా జీవితంలో పదిలపరచుకున్నాం. ఆ విధంగా గురుదేవుల సన్నిధిలో నాలుగురోజులు సాయిఊసు సాయిధ్యాసలతో నాలుగు క్షణాల్లా గడిచిపోయినాయి. చివరిరోజు పూండీ వెళ్ళి అట్నించి తిరుగు ప్రయాణమవుదామనుకున్న మాకు మేము ఊహించని మరో అరుదైన వరం లభించింది. అది పూండీలో గురువుగారి దర్శనం. మేమంతా అక్కడ స్వామి సన్నిధిలో ఉండగా హఠాత్తుగా అక్కడకు గురుదేవులు విచ్చేసారు. వారి రాక ఒక్కసారిగా మాలో ఆనందం కలకలం రేపింది. మా మనస్సులనే ప్రేమసుమాలతో వారి పాదాలను అర్చిస్తూ, కన్నుల వెలిగే ఆనంద దీపాలతో మేమందరం గురుదేవులకు ఆరతిస్తుండగా పూండీ స్వామిని ప్రత్యక్షంగా సేవించుకున్న ఆలయ పెద్దపూజారి గురుదేవులను పూండీస్వామికి ఆరతివ్వమని ఆహ్వానించారు. తేజోరూపులైన గురువుగారు పూండీస్వామి విగ్రహానికి ఆరతివ్వడం ఒక మహత్తర దృశ్యంగా మా హృదయాలలో ముద్రించుకుపోయింది.

ఈ విధంగా మా మనోరథాలీడేరటమే కాదు, "సాయిపథం" పట్ల అవగాహననూ, బాబాపట్ల మరింత ప్రేమనూ పెంచుకునేందుకు దోహదపడిన ఆ మహదావకాశం తృప్తితో కూడిన శాంతిని, ఆనందకాంతిని ఇవ్వగా ఆ మధురానుభూతులను తలచుకుంటూ మా ఊర్లకు బయలుదేరి వచ్చాం.

**– సుంకర నర్మద**

## ఆశీస్సుల అంతరార్థాలు

భారతీయ సంప్రదాయంలో తమకంటే పెద్దవారికి నమస్కరించటం, గౌరవించటం, వారి దారికి అడ్డు తొలగటం. వారిని అనుసరించటం, వారి ఆదర్శాల్ని నిలబెట్టటం వంటి మంచి లక్షణాలు ఉండేవి. ఇప్పుడంతా ఈ స్థితిగతులకి విరుద్ధం. ఇప్పుడెవరూ ఎవరినీ లెక్కపెట్టరు. అంతా ఎవరికీ వారే. తమకు తామే తెలివైన వాళ్ళమని, తమ తల్లిదండ్రులు, గురువు, ఇంటి పెద్దల వంటి వారంతా మూర్ఖులనీ, ఛాందసులని, మూఢాచార పరాయణులనీ అనుకుంటూ ఒకానొక మోసపూరిత మనస్తత్వంలో కొట్టుమిట్టాడుతున్నారు. దానివల్ల నష్టపోయేదెవరో ఆత్మపరిశీలనలోగాని తేలదు. కడివెడు పాల మీద వొక్కింత మీగడలాంటిది సంప్రదాయమన్నారు సి.నారాయణరెడ్డి. కాల పరీక్షలకు నిలిచిన ఎన్నెన్నో అనుభవాల క్రోడీకరణే సంప్రదాయం.



కాబట్టి, పెద్దల అనుభవాలు పిల్లలకు మార్గదర్శకాలవుతాయి. చెడు ఫలితాలు వచ్చి, కష్టాలు కలిగి మనసు దుఃఖపడకుండా కాపాడుతాయి. అందుకే పెద్దలకు, దైవాలకు సమస్కరించటం, వారిని ప్రసన్నం చేసుకోవటం వారి శుభ సంకల్పాన్ని ఆశీర్వచనంగా పొందటం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉగ్గుపాల నుండి నేర్పేవారు. ఆ పద్ధతి పిల్లల జీవితాన్ని క్రమశిక్షణతో నడిపి తీర్చిదిద్ది, సుఖశాంతులందించేది. స్వయంకృతాపరాధాలకు ఎప్పుడూ మినహాయింపు వుంటుంది కదా!

ఇక్కడే ఒక్కమాట చెప్తాను. రెండు చేతులూ జోడించి నమస్కరించటం అంజలి ఘటించటం. హృదయం ద్రవించి నీరై, కన్నీరైపోయేలా చేసేది అంజలి. అది కరుణరసం యొక్క స్థాయి. గుండె కరిగితేనే కరుణ. కాబట్టి "విద్యోపదేశం కృపయైన కుర్యాత్" అన్నారు. గురుకృపతోనే విద్యవస్తుంది. దొంగ దండాలు పెట్టి కరుణించమంటే ఎవరూ వినరు. ఏమీ చేయరు. అలాగే, పాదాభివందనం. ఇప్పుడిదో తంతులా, నాగరికతా విశేషంగా, నటనగా మారిపోతూ వుంది. ఆచారం మంచిదే కానీ అసలు విషయాన్ని కూడా మర్చిపోకూడదు కదా! **ఏ చరణాలతో ఆచరించి సత్ఫలితాన్ని పొందారో, అదే ఆచరణలో నేనూ మంచి ఫలితాన్ని పొందుతానని ఆ చరణాలు (పాదాలు, కాళ్లు) పట్టుకుని ప్రమాణం చేయటమే పాదాభివందనంలో పరమార్థం.** – *సేకరణ : గురుకృప*

**సద్గురు ప్రేమ 'గని' – ఆనందంగా జీవించడమే మా 'పని'...**

స్తబ్ధంగా సాగిపోతున్న జీవితాలు....
వెతల వెలుతులలో క్రతువులకు అంకితమైన మనసులు, మనుషులు...
అర్థంలేని ఆచారాల మధ్య, అహపు అడ్డుగోడల అపస్వరాల మధ్య –
జీవితం వరమని, శాపం కాదని తెలుసుకోలేని జన జీవితాలు...

అలాంటి సమయంలోనే మా జీవితాలలోకి ఒక అఖండమైన వెలుగు
శ్రీబాబూజీగా ప్రభవించింది. నాటి నుండి
'స్వేచ్ఛ' – జాతకపు జాడ్యాల నుండి...
'స్వేచ్ఛ' – కులాల కుళ్ళు నుండి...
'స్వేచ్ఛ' తంతుల చట్రాల నుండి...
వారి అనుగ్రహ భిక్ష ఈ 'స్వేచ్ఛ' – వారి చరణాలు చేరడం మా 'ఇచ్ఛ'...

– గురుకృప

# గురుకృపాలహరి



"సత్పురుషుల సాంగత్యం గంగవలె పాపాలను పోగొడుతుంది, వెన్నెల వలె మనస్సుకు ఆనందాన్నిస్తుంది, సూర్యప్రభవలె అజ్ఞానాన్ని తొలగిస్తుంది, చెట్ల నీడవలె తాపాన్ని తీరుస్తుంది" అంటుంది హితోపదేశం. అట్టి సత్పురుషుల సాంగత్యం సర్వవేళలా లభించగలదా? సాధ్యమేనా? అంటే సాధ్యమే! సర్వవేళలా వారి సాంగత్యాన్ని అందించగల కల్పవృక్షాలు మహాత్ముల సచ్చరితలు. సిక్కు సంప్రదాయంలో వారికి 'గురుగ్రంథసాహిబ్' గ్రంథమే గురువు. భగవాన్ రమణులను "స్వామీ! రేపు మీరు దేహం విడిచాక మాకు మీ సాన్నిధ్యము ఎట్లా లభిస్తుంది" అని వాపోయిన వారికి "ఎందుకు చరిత్ర ఉందిగా" అన్నది సమాధానమయ్యింది. అంటే పావన గంగానది మన ముంగిట్లో ఉన్నట్లే కదా! చంద్రుని నీడ, సూర్యుని తోడు, అలసిన క్షణాన చెట్టు నీడన సేదతీరే చోటు అన్నీ లభించినట్లే కదా! మహాత్ముల చరితలనే (సన్నిధిని) పావన గంగను ఇంట్లోనే ఉంచుకుని కుళాయి నీళ్లకు పరుగులెత్తుతున్నాం రకరకాల క్రతువుల రూపంలో. ఒక్క ముక్కలో చెప్పాలంటే "సత్పురుషులు నడిచి వచ్చే గంగాతీర్ధం". "యత్రరామస్తత్రాయోధ్యా – రాముడెక్కడుంటే అదే అయోధ్యా నగరము!" మహాత్ముల చరితలతో మనం చేసే ఈ ప్రయాణంలో మనసు నిలిపితే వారు ఎక్కడ ఉంటే అక్కడే మనమూ ఉందాం. వారు నటరాజస్వామికి నమస్కరిస్తే మనమూ చిదంబర క్షేత్రంలో వారితోనే ఉందాం. వారు వారణాశికి పయనమైతే వారి పదాల వెంట పరుగులెత్తుతూ ఈశ్వర పదం మనమూ చేరుదాం. మా గురుదేవులు శ్రీబాబూజీ అనుక్షణం శ్రీసాయినే స్మరిస్తూ ఉండేవారు. వారు నీటిని స్వీకరిస్తున్నా, ఆహారం సేవిస్తున్నా, కూర్చున్నా, లేచినా, ఏచిన్న పనిని చేస్తున్నా సరే సదా సాయిని తలచుకుంటూ ఉండేవారు. అలా సర్వకాలములలోనూ శ్రీసాయితో సాంగత్యమే వారిది. మనవంటి భక్తిమాత్రోప జీవులకు మార్గమేది? పూజ్య గురుదేవులు, శ్రీసాయినాధులు, రమణులు, పూండీస్వామివారు, చంద్రశేఖరులు వంటి మహాత్ముల చరితలే మనకు ఊసు, ధ్యాసలైనచో ఆ సత్పురుషులు సాంగత్యము మనకు సదా లభించగలదు, మనలో పరివర్తన రాగలదు – మనల్ని సద్గురు చరణాలను చేర్చగలదు. మనందరకు శ్రీచంద్రశేఖరుల చరితామృతంతో మరో గొప్ప అనుభూతి ఈ శీర్షికతో ప్రారంభమవబోతోంది. పదండి – 'పెద్దాయన' పదాలను పట్టుకుని మనమూ 'కాశీ' యాత్ర చేద్దాం.

పరాంగపట్టు యాత్ర తర్వాత స్వామివారు చోళుల శిల్ప కళా సౌందర్యము ఉట్టిపడే బృహదీశ్వర



ఆలయంలో 1933 సం॥ వ్యాసపూజను నిర్వహించారు. ఆలయ ముందుభాగంలో జరిగిన ఆ మహోత్సవాన్ని భక్తజనులు దర్శించి తరించారు. వారు ఆ సంవత్సరం చాతుర్మాస్యమును ఉత్తరవీధి, తంజావూరులో ఉన్న మూకాస భవనంలో ఆచరించారు. సుమారు రెండు వందల సంవత్సరాలుగా కంచి ఆచార్యులు తంజావూరు క్షేత్రమునకు వస్తున్నప్పటికిని అక్కడ శంకరమఠం మాత్రం స్థాపించబడలేదు. ఆచార్య పరంపర విజయ యాత్రలకు గుర్తుగా ఒక శంకరమఠం ప్రాంగణం అక్కడ ఏర్పడాలని తంజావూరు పురభక్తుల ప్రగాఢ వాంఛితమయ్యింది. అక్కడ భక్తులు, తంజావూరు రాజు ప్రతాపసింహ మహారాజ్, టి.ఆర్.జోషి ప్రభృతుల చొరవతో స్వామివారు విడిది చేసిన మూకాస భవనాన్ని శంకరమఠానికి శాశ్వత చిరునామాగా చేయగలిగారు పురజనులు.

తంజావూరులో స్వామి విడిది చేసిన సమయంలోనే 'కాశీ'యాత్రకు బయలుదేరాలని నిశ్చయించారు. ఇంతకు పూర్వమే పీఠపరివారముతో యాత్ర చేయదలచిన స్వామి వారు అనంత కృష్ణశర్మ అనే యువకుని ముందుగా యాత్ర చేయవలసినదిగా ఆదేశించారు. అయితే ఈ క్రింది నియమాలను స్వామి అతనికి నిర్దేశించారు. కాశీ చేరే వరకు యాత్రనంతా పాదచారిగానే పూర్తి చేయాలి. అతని ఆహారాన్ని అతనే వండుకు తినాలి. ఉత్ప్రేరకాలైన టీ, కాఫీలను త్రాగకూడదు. పరిమితమైన పాత్రలు, దుస్తులు మాత్రమే తనతో తీసుకు వెళ్ళాలి. ఆహారం తయారు చేసుకునేందుకు సహృదయుల వద్ద బియ్యము, గోధుమలు తీసుకోవచ్చు. ఎవ్వరి వద్దా బహుమానాలు, ధనము స్వీకరించకూడదు. ఆరోగ్య కారణాల వల్ల తప్ప, ఎక్కడా ఒక్కరోజుకు మించి ఉండరాదు. ఎవరైనా అడిగితే తాను పరమాచార్యుల ఆదేశం మేరకు కాశీయాత్ర చేస్తున్నానని చెప్పవచ్చు. తనకిచ్చిన పోస్టుకార్డులలో తను ఎంత దూరం ప్రయాణం చేసాడో, ఎటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడో ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ఉండాలి. కాశీయాత్ర నుండి తిరిగి వచ్చే సమయానికి తను హిందీభాషను నేర్చుకుని ఉండాలి. తిరుగు ప్రయాణంలో తాను రైలులో పరమాచార్య సన్నిధానాన్ని చేరవచ్చు. శారీరకంగానూ, మానసికంగానూ పూర్తి ధారుఢ్యం కలిగి మొక్కవోని శ్రద్ధాభక్తులు గల భక్తునికి తప్ప నాటి రోజుల్లో ఈ యాత్ర సాధ్యమయ్యే పనేనా? అనంతకృష్ణకు అన్నింటికంటే గురుభక్తి మెండు. ఇక మిగిలిన లక్షణములన్నీ అదనపు శోభలే! పరమాచార్యుల ఆజ్ఞననుసరించి అనంతకృష్ణ ఆరుమాసాల కాలంలో వారణాసి చేరాడు. అతను నిత్యం పంపే పంపే పోస్టుకార్డులలో ఎంతో



ముఖ్యమైన, ఆసక్తికరమైన అంశాలు ఉండేవి. తాను ఎంతదూరం నడిచాడు, ఎక్కడెక్కడ నీటి సౌకర్యం ఉంది. వాతావరణం అనుకూలస్థితులు ఎలా ఉన్నాయి. ఇలా ఎన్నో! ఎక్కువశాతం తాను వెలుతురు ఉన్న సమయంలోనే నడక సాగించేవాడు. అయితే ఒకనాడు చీకటిపడ్డాక అడవి బాటన నడవవలసి వచ్చింది. పెద్దవైన నీటిపైపులలో తను దాగి ఉండాల్సిన స్థితి ఎదురైంది. తాను రెండు పులులను చూడవలసి వచ్చినా సరే స్వామికృపతో ఏ సంకటమూ లేకుండానే కాశీ చేరాడు. కొన్ని రోజులు అక్కడ కాశీ విశ్వనాథుని సేవించుకున్నాక పరమాచార్యస్వామి అనుజ్ఞ మేరకు మఠ మేనేజరు కుంభకోణానికి రైలు టిక్కెట్టు ఏర్పాటు చేయడము, అనంతకృష్ణ స్వామిసన్నిధికి చేరడము జరిగాయి. పరమాచార్యులు అతని గురుభక్తిని, పట్టుదలను, మెచ్చుకుని ఆశీర్వదించారు. ఆ తర్వాత కాలంలో అతను వివాహం చేసుకుని, మఠంలోని ఉద్యోగస్తునిగా చేరి జీవితాన్ని సఫలం చేసుకున్నాడు.

ఈ తరంలో ఔత్సాహికులైన సాయిభక్తులను మా గురుదేవులు పూజ్య శ్రీబాబూజీ పాదయాత్రను ఎలా చేయాలో తెలియచెప్పి మార్గం చూపారు. **“మనం మామూలుగా నడుస్తాం. అయితే ఒక లక్ష్యం కోసంగా నడిస్తే అది యాత్ర అవుతుంది. తీర్థయాత్ర అవుతుంది. నడిచే యాత్ర కనుక పాదయాత్ర అవుతుంది. మనందరికీ ఒక లక్ష్యం ఉంది. అది బాబాను చేరడం - వారు నివసించిన శిరిడీ క్షేత్రాన్ని చేరడం-వారిని చేరడమన్న లక్ష్యానికి సూచ్యార్థంగా శిరిడీ వైపుగా సాగే మన పయనం-ఏం చేస్తూ శిరిడీ చేరాలి అంటే బాబాను స్మరిస్తూ! మన జీవితంలో ఎన్నో నియమాలు పాటించాలని ఆశిస్తాం. అన్ని సమయాలలో అవి సాధ్యపడకపోవచ్చు, పాటించే అవకాశం రాకపోవచ్చు. పాదయాత్ర మనకు అలాంటి నియమపాలనకు చక్కటి అవకాశమిస్తుంది. తక్కువ వనరులు, తక్కువ అవసరాలు, అతి తక్కువ సౌఖ్యాలూ వీటితో మనం ఎలా జీవించగలం? భిన్నరుచులు, చక్కటి పరుపు, చల్లటి వాతావరణం, నిశ్శబ్దంగా ఉండే గది ఇలా ఇవన్నీ మనకు ఆనందాన్నిస్తాయని మన విశ్వాసం. కానీ మనకు తెలుసు-ఇలాంటి సౌఖ్యాలపై ఆధారపడటం మంచిదికాదని! కనుక ఈ పాదయాత్రను అలా తక్కువ వనరులు, తక్కువ సౌఖ్యాలతో జీవించడానికి సోపానంగా మలచుకుందాం. మన వంటిపైన ఒక జత, చేతి సంచిలో ఒక జత బట్టలు- ఎక్కడ నిద్రించే అవకాశం లభిస్తుందో అక్కడ నిద్రించడం, వంటిపై జతను శుభ్రం చేసుకోవడం, సంచిలో జతను ధరించడం-ఇలా తక్కువ వనరులతో జీవించడాన్ని సాధనగా చేసుకుందాం. ఇలా ఒకటి, రెండు నెలలు ఆచరించుకుంటూ**



**శిరిడీ చేరే సరికి జీవితంలో ఇలా కూడా ఉండగలమన్న విశ్వాసం మనకు కలుగుతుంది. మనలో చాలా మందికి ఇలా జీవించగలమన్న విశ్వాసం ఉండదు. కానీ ఒక్కసారి ఇలా ఉన్న తర్వాత "అవును! అవసరమైతే నేను ఇలా జీవించగలనన్న" విశ్వాసం స్థిరమవుతుంది. ఇలాంటి లక్ష్యసాధనకే పాదయాత్ర నిర్దేశంచబడింది. మరాఠీ సంప్రదాయంలో 'వార్కరీ' విధానం పూర్తిగా ఇలాంటిదే! వార్కరీ అంటే 'నడిచే'వాడు. నడిచి యాత్ర చేసేవాడు. ఏదో ఆళంది నుండి పండరికి పల్లకీ తీసుకుని నడవడం కాదు అది. కేవలం పల్లకీని తీసుకువెళ్ళడమయితే రైలులోనో, బస్సులోనో తీసుకువెళ్ళచ్చు. కానీ జ్ఞానదేవ్, నామదేవ్ మహరాజ్ వంటి సంతుల ఆంతర్యం అదికాదు. ఆళంది నుండి పండరీ వెళ్ళే క్రమంలో నేను పైన చెప్పిన లక్ష్యసాధన వారు చూపిన మార్గం. అది మరిచిపోకూడదు"** అన్నారు శ్రీబాబూజీ. **"సాధన అనేది జీవితంలో భాగం కావడం కాక మన జీవితమంతా సాధనలో భాగం కావాలి"** అన్న గురుదేవుల మాటకి పాదయాత్రలో ఎన్నో సోపానాలు దర్శనమిస్తాయి. కొందరు సాయి భక్తులు అలా వారి వారి స్వస్థలాల నుండి శిరిడీ క్షేత్రానికి పాదయాత్రగా వెళ్ళడం జరిగింది. వారిలో యువకులు, మధ్యవయస్కుల నుండి పెద్దవారు కూడా ఉన్నారు. వారి వారి అనుభవాలు, అనుభూతులు పంచుకుంటే సద్గురు ప్రేమకావ్యమవుతుంది. అనునిత్యం శ్రీబాబూజీ వారిని కంటికి రెప్పలా ఎలా కాచుకున్నారో తెలుస్తుంది. ఆసక్తి కలిగి, అన్వేషణలో ఉన్నవారు వార్కరీ సంప్రదాయము గురించి ఇంకా పరిశోధనాత్మకముగా శోధించిన ఎన్నో చక్కటి అంశములు అవగతమవగలవు. తులనాత్మకంగా పరిశీలిస్తే శ్రీబాబూజీ చెప్పిన **"మౌలికమైన ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నడూ మారవు!"** అన్న సద్గురువాక్యం 'పాదయాత్ర' అనే సాధనా పర్వానికి ఆయువుపట్టుగా అవగతమవుతుంది.

1932వ సం॥ చివరలోనే అనంతకృష్ణ శర్మ కాశీ వెళ్ళిన మార్గంలోనే పీఠపరివారముతో కలిసి స్వామి గంగాయాత్ర చేయాలని సంకల్పించారు. ఆ ఏర్పాట్లు చూడటానికి కన్నకుడి స్వామినాథన్‌కు బాధ్యత అప్పగించారు స్వామి. స్వామివారి పర్యటన తెలుసుకున్న కాశీవాసులు, అధికార, అనధికారులు, విశ్వవిద్యాలయ కులపతులు, మఠాధిపతులు, విశ్వనాథుని ఆలయ ప్రధానార్చకులు.... ఎందరో స్వామివారికి వారి వారి ప్రాంతాలకు వేంచేసి ఆశీర్వదించమని వినతి పత్రాలు సమర్పించారు. కొన్ని వందల వినతి పత్రాలతో తంజావూరులో విడిది చేసిన స్వామివారి సన్నిధానానికి వచ్చాడు స్వామినాథన్. చాతుర్మాస్యం ముగిసిన వెంటనే యాత్రను ప్రారంభించాలని నిశ్చయించారు శ్రీచరణులు.



అలా విజయదశమి పర్వదినాన తమ అనుగ్రహ భాషణాలతో, తమ చరణస్పర్శతో జాతి గతిని మార్చటానికి, పరమార్ధం తెలిపి, పురుషార్ధ సాధకమైన భగవంతుని ఉనికిని ప్రతీ మనిషిలోనూ మేల్కొల్పడానికి, తంజావూరు నుండి పయనమయ్యారు పరమాచార్యస్వామి, ముస్లిం నవాబుల కాలంలో కూడా ఆచార్యులు చేసే యాత్రలకు వలసిన అన్ని మర్యాదలను, ఏర్పాట్లను చూడవలసినదిగా గవర్నమెంట్ అధికారులను, వ్యవస్థలను ఆదేశించడం ఆనాటి పరమత సహనానికి ప్రజలిచ్చిన ఆవశ్యకతను గుర్తు చేస్తుంది. నాటికాలంలో ఐదు వందల మంది మఠ ఉద్యోగులు, ఇరవై ఐదు ఎడ్ల బండ్లు, ఇరవై గుర్రాలు, ఐదు ఒంటెలు, మూడు ఏనుగులు పరివారంగా ఉండేవి కంచి మఠానికి. మద్రాసు ప్రభుత్వం 1933 సం॥ ఒక జి.వో.ను విడుదల చేసింది. స్వామివారి యాత్రను దిగ్విజయం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించడానికి, దానిని అనుసరించి హైదరాబాద్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా, బెంగాల్, పశ్చిమభారత సంస్థానాలన్నీ స్వామివారి యాత్రకు ఏర్పాట్లు చేశారు. రోజుకు ఇరవై మైళ్ళు నడుస్తూ తిరువణ్ణామలై మీదుగా ఆరణి, చిత్తూరు, పలమనేరు మార్గంలో మదనపల్లి చేరారు స్వామి. చిన్నతిప్పసముద్రమనే గ్రామంలో సుమారు ఒక నెల విడిది చేసారు స్వామి. కదిరి నారసింహుని దర్శనం చేసుకుని ధర్మపురి, అనంతపురం మీదుగా కర్నూలు చేరారు. కర్నూలులో ఒక వారం రోజులు విడిది చేసారు. స్వామి ఎక్కడికి చేరినా వేలాది మంది భక్తజనులు ప్రేమ నీరాజనాలు అర్పించారు. స్వామి వారి చేతులమీదుగా జరిగే చంద్రమౌళీశ్వర సేవను తిలకించి తరించారు, ఆనందించారు భక్తజనులు.

గురువు- దైవమై అయినప్పటికీ - మోక్షం పదం ఆనాటికే చేరినప్పటికీ సాధకుడిగా, ప్రబోధకుడిగానే దర్శనమిస్తున్నాడు. అల్ప వనరులతోనే పూర్ణజీవితాన్ని ఎలా అందుకోవాలో తాను జీవించి చూపిస్తున్నాడు. వారి మార్గం సుస్పష్టంగానే ఉంది. మన ఆలోచనే అస్తవ్యస్తంగా ఉంది. మన తరానికి సరిపడా సంపద ఉన్నా చాలడం లేదు. ఇంకా ఏదో లేదని ఆశ. బిడ్డలకు దానగుణం విలువ నేర్పే, దారి చూపే ప్రయత్నం సాగడం లేదు. మరో వంక గురుచంద్రులేమో వారి సమయాన్ని, ఆరోగ్యాన్ని, జ్ఞానాన్ని చివరకు జీవితాన్నే మనల్ని ఉద్ధరించటానికి త్యాగం చేస్తున్నారు. సద్గురు చంద్రుల జీవిత గమనం మనకు, మన ఆచరణ రాబోయే తరాలకు ఒక చక్కటి దిశను, దశను చూపాలని ఆ జగద్గురుచంద్రుల చరణాలను వేడుకుందాం. సద్గురు చరణామృత ప్రాప్తిరస్తు... శుభం భవతు...

**-గురుకృప**



## అంతర్జాలంలో అంతర్యామిత్వం

మీరు పదునైన మెదడు (sharp brain) తో పాటు దయ, ప్రేమ మరియు కరుణతో కూడిన హృదయాన్ని (warm heart) పెంపొందించుకోవాలి. ఈ రెండింటి యొక్క కలయిక ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుంది.

కేవలం పదునైన మెదడుతో మీరు ఆనందంగా జీవించే వ్యక్తి అవుతారనే హామీ ఇవ్వడం సాధ్యం కాదు. కొన్నిసార్లు చాలా తెలివైన వ్యక్తి, విద్యావంతుడు మరింత సమస్యాత్మకంగా, ఇబ్బంది కలిగించేవానిలా మారవచ్చు. దయ, కరుణ మరియు ప్రేమలతో నిండిన హృదయం, దీనితో పాటు తెలివి, పదునైన మెదడు కల వ్యక్తి మరింత సానుకూలంగా (Positive), నిర్మాణాత్మకంగా (constructive) మారుతాడు. ఇది ఎంతో ప్రధానము. ఉదాహరణకు నలంద మాస్టర్లు (నలంద ఆశ్రమంలోని 17 మంది గొప్ప భారతీయపండితులు) వారి మెదడును ఎంతో ఉన్నతంగా, గరిష్ట మార్గంలో ఉపయోగించారు. వారు నైతిక విలువలకు (నిజాయితీ, గౌరవం, దయ, ప్రేమ, కరుణ) ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. ఈ కారణం చేత వారి పదునైన మెదళ్ళు ఎంతో నిర్మాణాత్మకంగా మారాయి. కనుక ఇటువంటి హృదయాన్ని పెంపొందించుకోవాలి.

*– శ్రీదలైలామాగారి ముఖపుస్తకం నుండి సంగ్రహించబడినది.*

**మొక్కవోని గురుభక్తి... బిడ్డల శ్రేయస్సే ఆసక్తి...**

"నా భక్తులు కోరినవన్నీ ఇస్తాను. నేనివ్వదలిచింది వారడిగేంత వరకు!" అన్నారు శ్రీసాయి.
నిజానికి బిడ్డల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కోరినవన్నీ ఇస్తూనే ఉన్నారు...
ఇక వారివ్వదలచుకున్నది మనం అడగడమే మిగిలింది...
ఆలోచిస్తే శ్రీసాయి తమ జీవితం ద్వారా ఇచ్చింది.. తెలియచెప్పింది... "గురుభక్తి"..
తాము శిరిడీకి వచ్చిందే తమ గురుస్థానాన్ని ఆశ్రయించుకోవడానికి.... అంటిపెట్టుకోవడానికి...

చివరకు తాము దేహం విడిచే సమయంలో కూడా
తమ గురువు సమాధి ప్రక్కనే ఉండటానికి ఇష్టపడ్డారు..
తరాలు మారినా, యుగాలు మారినా, తమ గురువు చెంతన ఉండే సమాధానమిస్తున్నారు..,
మనందరికీ 'గురువే' సమాధానమని... 'గురువే' సర్వస్వమని చెప్పకనే చెప్పారు శ్రీసాయి...
శ్రద్ధాసబూరీల సమన్వితమైన మొక్కవోని 'గురుభక్తి'తో మమ్ము దీవించు సాయి...

–గురుకృప



అట్లా తయారైనాడు. ఏడవాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలి. ఏడుపుకు జంకకూడదు. భయపడకూడదు. ప్రేమతో సాధించుకోవాలిగాని, ఏడుపుతో సాధించుకునేదేంటి? కాబట్టి ఏదైనా సరే ప్రేమతోనే సాధించుకోండి. ప్రేమే సాధనం. అలడగాలు, అహంకారాలు ఎందుకు? వాళ్ళు అంత నిరహంకారంగా ఉన్నారు కానీండి, నాకు కొద్దిగా ఆత్మాభిమానం ఎక్కువండి. దుర్యోధనుడి టైప్ నేను. 'అభిమాన ధన సుయోధన నేను'. నాకు కొంచెం యాటిట్యూడ్ ఎక్కువండి. దాన్ని అర్థం చేసుకోవాలి. అదేదో పెద్ద గొప్పలాగా వాడికి యాటిట్యూడ్ ఉండటం. వాడికి యాటిట్యూడ్ ఉండటం వాడి దౌర్భాగ్యం. వాడికి యాటిట్యూడ్ ఉందట. ఎదుటివాడు అర్థం చేసుకొని వాడు ఏం చేసినా మనం భరించాలట. ఏం చూసుకొని నీకు యాటిట్యూడ్! ఏం సాధించేశావని నీకు యాటిట్యూడ్ ఉండటానికి? నీకు అహంకారం ఎందుకుంది? నీవేమన్నా సాధించావా? నీకెందుకంత పొగరసలు? అది నీ జబ్బు. మనోజాడ్యం. దాన్ని ఎదుటివాడు అర్థం చేసుకోవాలట. చేసుకుంటాడు ఖచ్చితంగా. నీకు జబ్బు అని అర్థం చేసుకుంటాడు. నువ్వు ఎందుకూ కొరగాని వెధవ అని అర్థం చేసుకుంటాడు. అది చాలా గొప్ప అన్నమాట. You have to understand. I have attitude you know, సిగ్గుపడాలి ఆ మాట అనడానికి. మనం ఏం సాధించాము? మనం ఏంటి? సాధించిన వాడెవడూ అహంకారంగా ఉండటం లేదు. ఏం సాధించకుండానే ఎందుకు పుల్లాకుల్లాగా ఎగిరెగిరి పడటం? ఎగిరిపడకండి. చక్కగా క్లీన్ చేసిన విస్తర్లాగా మనసు పెట్టుకొని బాబా ముందుకొచ్చి భిక్షాందేహి బాబా! అని అడగండి. భిక్ష అనే ఎన్నో పంచభక్ష్య పరమాన్నాలు మన ఆకులో వేస్తారాయన.

–శ్రీబాబూజీ



## అవతారమూర్తులు - కారణజన్ములు

తాము వచ్చిన దివ్యకార్యం పూర్తి కాగానే దేహాన్ని తాముగా విడిచిపెడతారు.
కాని, వారి పనిని వారు కొనసాగిస్తూనే ఉంటారు. పెద్దలైన వారు తమ పనిని
కొనసాగించడానికి దేహమే కావాలా? వారు వెలుగు మూర్తులు (దివ్వెలు) కదా!

సూర్యుడు, చంద్రులు వెలుగులమూర్తులు. మరి వారికి దేహం ఉన్నట్లా? లేనట్లా?
వారు పనిచేస్తున్నట్లా? లేనట్లా? అవతార పురుషుల గాథా అంతే.
తమ దివ్యసన్నిధిని అలవోకగా అనుభవించగల హక్కును,
అర్హతను, యోగ్యతను 'ప్రేమ'తో అనుగ్రహిస్తారు.

గురుకృప